V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
08-11-2025

సంపుటి : 01 | సంచిక : 117 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

డా॥ కాచం సత్యనారాయణ CMD



# పెద్ద మనసున్న చిన్న ఎల్లారెడ్డి!

రజాకార్లను తరిమికొట్టాడు. ఊరందరికీ తోడున్నాడు



**విశ్వంభర, మహబూబ్ నగర్ :** ఆయన పేరుకే చిన్న ఎల్లా రెడ్డి! కానీ పెద్ద మనసున్న వ్యక్తి . సాధారణ కుటుంబంలో జన్మించి అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. రజాకార్లను తరిమికొట్టాడు. పేదలకు అండగా నిలిచాడు.వందలాది మందికి ఉపాధి కల్పించాడు. తన సంతానం ను కూడా సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాడు. దేవరకద్ర నియోజకవర్గం లోని ధమాగ్నాపూర్ గ్రామంలో తోకల చిన ఎల్లారెడ్డి 1926 అక్టోబర్ 10వ తేదీన జన్మించాడు. నాటి పరిస్థితులు ఘోరంగా ఉండేవి. గ్రామాలపై రజాకార్లు పాశవిక దాడుల నిర్వహించేవారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో గ్రామస్తులను కూడగట్టాడు. రజాకార్లను తరిమికొట్టాడు. నాటి ఉమ్మడి పాలమూరు జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్నప్పుడు, తన పరిచయస్తుల ద్వారా వందలాది మందికి ముంబైలో ఉపాధి కల్పించాడు. మహిళలు బీడీ ఆకును సేకరించేలా ప్రోత్సహించాడు. కుటీర పరిశ్రమను స్థాపించి ఉపాధి కల్పించాడు.మూడు దఫాలు దమగ్నాపూర్ కు ఎదురులేని నేతగా, ప్రజల మనసు గెలుచుకున్న సర్పంచిగా ఎన్నికయ్యాడు.ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరిస్తూ జీవితంలో కష్టపడితేనే, ఎదుగుతామని ముక్కు సూటిగా చెప్పేవాడు. తాను చెప్పినదే స్వయంగా పాటించాడు.పాలమూరు జిల్లా పరిసర ప్రాంతాల్లో కూడా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. సాగునీరు సరిగ్గా లేని ఆ రోజుల్లో విత్తనాలను స్వయంగా తయారు చేయడం అనేక మందికి నేర్పించాడు. తద్వారా పాడిపంటలను పెంపొందించాడు. ధాన్యపు రాశులను కురిపించాడు. కులమత బేధం లేకుండా పరిసర గ్రామస్తులు అందరికీ తోకల చిన్న ఎల్లారెడ్డి పెద్దదిక్కుగా నిలిచాడు. గ్రామాలలో కనీస సౌకర్యాలు కల్పిస్తే గ్రామస్తులు తమ చెయ్యి దాటిపోతారేమోనని కొందరు నేతలు భావించేవారు.. కానీ వారికి భిన్నంగా గ్రామానికి రోడ్లు మంచినీటి సౌకర్యాన్ని, ఇతర వసతులను చిన్న ఎల్లారెడ్డి కల్పించారు. గ్రామస్తులకు తలలో నాలుక లాగా పెద్దదిక్కులాగా నిలిచాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. కష్టనష్టాలకోర్చి వారందరినీ ప్రయోజకులుగా తీర్చిదిద్దారు.ఉన్నత విద్య కోసం అనేక మందికి ఆర్థిక సాయం చేశారు. వారంతా ఇప్పుడు ప్రయోజకులుగా ఉన్నారు. ఇక అనేక వ్యవస్థలకు అండగా నిలవడం ద్వారా, ఆయా సంస్థల ఉన్నతికి పాటుపడ్డారు. వందలాదిమందికి ఉపాధి కల్పించే బాటలు వేశారు.

వారి మూడవ కుమారుడు డాక్టర్ సురేందర్ రెడ్డి హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో సీనియర్ సర్జన్ గా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరు గడించారు. అనేక సామాజిక,రాజకీయ సేవా కార్యక్రమాల్లో సురేందర్ రెడ్డి చురుగ్గా పాల్గొంటున్నాడు. మంచి మనసున్న రాజకీయ నేతగా ఎదిగాడు.పెద్ద కుమారుడు ప్రతాపరెడ్డి , రెండో కుమారుడు రవీందర్ రెడ్డి పిలిస్తే పలికే వారుగా పేరు గడించారు. తమ వంతు సాయం చేస్తూ ఆ ప్రాంత వాసులకు ఇంటి పెద్ద దిక్కు అయ్యారు. తన 99 వ ఏట గత నెల 28వ తేదీన ఎల్లారెడ్డి కన్నుమూశారు. ఒక్కసారిగా దమగ్నాపూర్ శోకసంద్రం అయింది. చిన్న ఎల్లారెడ్డి అభిమానులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పరిసర ప్రాంతాల వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. పెద్ద దిక్కును కోల్పోయామని కంటికి మింటికి ఏకధారగా విలపించారు. చిన్నయల్లారెడ్డి లేని లోటు తీర్చలేనిది.. పూడ్చ లేనిది. శనివారం నాడు తోకల చిన్న ఎల్లారెడ్డి దశదినకర్మను దమగ్నాపూర్ లో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అనేకమంది రాజకీయనేతలు, పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు ఎల్లారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉంటామని చెప్పారు.అనేకమందికి పెద్దదిక్కుగా ఉన్న చిన్న ఎల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుందాం.



## వందేమాతరం గేయం 150 వసంతాలు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది

**- చిలుక ఉపేందర్ రెడ్డి**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** వందేమాతరం గేయం 150 వసంతాలు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని ఐటీడిఈఎస్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో వందేమాతరం గేయం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చిలుక ఉపేందర్ రెడ్డి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1875లో బంకిమ్ చంద్ర చట్టర్జీ రచించిన వందేమాతరం మనకు అజరామరమైన దేశభక్తి గీతంగా మారింది. "వందే మాతరం" అంటే "మాతృభూమికి వందనం, నమస్కారం." ఇది కేవలం ఒక పదం కాదు ఇది భారత దేశ ఆత్మ, మన గర్వం, మన దేశప్రేమకు ప్రతీక. ఈ గీతం మన స్వాతంత్ర్య పోరాట యోధుల రక్తంలో ఉప్పెన తెచ్చింది. లాలా లజపత్ రాయ్, బిపిన్ చంద్ర పాల్, బాల గంగాధర తిలక్, సుభాష్ చంద్రబోస్ వంటి మహానాయకులు ఈ గీతాన్ని దేశానికి స్ఫూర్తిగా ఉపయోగించారు. ఈ కార్యక్రమంలో రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఆంజనేయ ప్రసాద్, శంకర్, శ్రీనివాస్, శేఖర్, సైదయ్య, వెంకటేశ్వర్లు, నీలిమ, అర్చన, సురేఖ, పెద్దవూర సైదులు, విప్లవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా హైడ్రా : వీహెచ్



**విశ్వంభర, అంబర్ పేట :** హైడ్రా చెరువులు, ప్రజల భూములను, ప్రభుత్వ భూములను, కాపాడుతూ ప్రజలకు అండగా ఉందన్న విహెచ్ . బతుకమ్మకుంట అభివృద్ధిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు అంబర్‌పేట్ బతుకమ్మకుంట పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తప్పు పట్టారు. ఆయన మాట్లాడుతూ, "బతుకమ్మకుంటను కబ్జా చేసింది మీ పార్టీ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి కాదా? మీరు మంచి విద్యావంతుడు, మీరు మాట్లాడే భాష బాగుంటుంది. కానీ తప్పుడు ప్రచారం చేసి మీ ఇమేజ్‌ను దెబ్బతీయొద్దు" అన్నారు.అతను మరింతగా మాట్లాడుతూ, "జూబ్లీహిల్స్‌లో మా పార్టీ అభ్యర్థిని రౌడీ అంటారు. ప్రజల కోసం కేసులు ఎదుర్కొంటే రౌడీలా? మీ పార్టీలో రౌడీలే లేరా?" అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో కబ్జాలు విస్తరించాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్‌సిటీ అభివృద్ధిపై దృష్టిసారిస్తోందని, బతుకమ్మకుంటను అందరికీ ఉపయోగపడే పార్కుగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. "హైడ్రాను అనవసరంగా విమర్శించడం ఆపాలి. మంచి పనులు జరుగుతుంటే అవి అంగీకరించాలన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిద్ది రాంబాబు, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, శంభుల శ్రీకాంత్ గౌడ్ , గరిగంటి రమేష్, రామ్మోహన్, కోట్ల కిరణ్ , సిపిఎం నాయకుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉంది

**- వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి. ఇంద్రాసేన రెడ్డి**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వంగా ఉందని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్కే పురం డివిజన్ చిత్ర లే అవుట్ చిల్డ్రన్ పార్క్ నందు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వందేమాతరం గేయం 150 ఇయర్స్ పూర్తి అయినా సందర్భంగా చిత్ర లే అవుట్ సభ్యులు అందరూ వందేమాతరం గీతం ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి భావం పెంపొందించేలా వందేమాతరం గీతమును ఆలపించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యస్. చంద్ర రావు, సీనియర్ సిటిజెన్ అధ్యక్షులు నరసింహ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మధు సూదన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రామ చంద్ర రావు,చిత్ర లే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, ఇతర వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## వైద్య సేవలో అంకితభావం, అల్యుమ్ని సేవలో నాయకత్వం

**- డా. కేయూఎన్ విష్ణు**



**విశ్వంభర, హైదరాబాద్ :** సమాజ సేవకు, వైద్య వృత్తి నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తున్న పేరు డా. కేయూఎన్ విష్ణు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ (ఓఎమ్సి) 2008 బ్యాచ్‌కి చెందిన ఆయన ప్రస్తుతం నీలోఫర్ హాస్పిటల్ లో సీనియర్ రెసిడెంట్ పిడియాట్రిక్ లో పనిచేస్తున్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయనకు ఉన్న మమకారం, ప్రేమ, అంకితభావం వైద్య రంగంలో ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రతి చిన్నారి చిరునవ్వు చూడటమే తన నిజమైన విజయమని ఆయన నమ్మకం.తన విద్యార్థి దశ నుంచే కళాశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, మరియు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఎల్లప్పుడూ సహాయకుడిగా నిలిచారు. ఈ సేవా దృక్పథమే ఆయనను ఓ ఎం సి అల్యూమిని అసోసియేషన్ - 2025 ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పదవికి పోటీ చేయడానికి సిద్ధం అయ్యారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ అభివృద్ధికి మద్దతుగా మీ విలువైన ఓటు డా. కేయూఎన్ విష్ణుకి వేయాలని కోరారు.

## అక్టోబర్ విప్లవం – దోపిడి లేని సమాజానికి ప్రేరణ : తమ్మినేని

**విశ్వంభర, హైదరాబాద్ :** దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని అక్టోబర్ విప్లవం చూపించిందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో అక్టోబర్ విప్లవ వారోత్సవాల సందర్భంగా "అక్టోబర్ విప్లవం - విశిష్టత" సెమినార్ జరిగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ ప్రజల సహకారంతో రాజశాహీ పాలనను కూలదోసి సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించిందన్నారు. పేదలకు భూములు, అందరికీ రేషన్, సంక్షేమం అందించిన ప్రభుత్వం ప్రపంచానికి ప్రత్యామ్నాయ పాలన చూపిందన్నారు.సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సోషలిస్టు ఆలోచనలు నేడు మరింత బలంగా పునరుజ్జీవించాయని చెప్పారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన, అభివృద్ధి, ఉపాధి సృష్టిలో విశేష విజయాలు సాధించిందని వివరించారు. అమెరికాలో కూడా సోషలిస్టు దృక్పథం పెరుగుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని పాలనలో కలుపుతోందని విమర్శిస్తూ, అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ప్రజా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.సెమినార్‌లో పార్టీ రాష్ట్ర నాయకులు జె.బాబురావు, ఎండీ అబ్బాస్, బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గీత వృత్తి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్ :** గీత వృత్తి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గీత వృత్తి పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. నవంబర్ 8న ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి అధికారులకు మెమోరాండాలు సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయం ఆబ్కారీ భవన్ వద్ద సంఘం ప్రతినిధులతో ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు. అనంతరం జాయింట్ కమిషనర్ ఆర్ సురేష్ కు రూ .13 కోట్ల ఎక్స్ గ్రేషియో బకాయిలను తక్షణం విడుదల చేయాలని, ఎక్స్ గ్రేషియో 10 లక్షలకు, 5 వేలకు పెన్షన్ పెంచాలని, వన పెంపకం కు 500 జీవో ప్రకారం పది ఎకరాల భూమి ఇవ్వాలని వృత్తిని ఆధునికరించాలని, ఏజెన్సీ ఏరియాలలో కల్లు గీస్తున్న వృత్తిదారులకు సొసైటీలు ఎల్ ఎఫ్ టి లు ఇవ్వాలని రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ నేతృత్వంలోని డిజి సాయిల్ గౌడ్ ప్రధాన కార్యదర్శి, సమన్వయ కార్యదర్శి నాగభూషణం, కేవిఎల్, పి రాములు, యాదయ్య, టి రాములు, సుదర్శన్ గౌడ్, పి పర్వతాలు, శ్రీశైలం, పొలగాని రవికుమార్, డీజీ నరేంద్ర ప్రసాద్ లు తో కూడిన ప్రతినిధి బృందం మెమోరాండం ఇచ్చారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



**విశ్వంభర, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సిపిఐ శ్రేణులు షేక్‌పేట్ డివిజన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించాయి. ఓయూ కాలనీ, వినోబా నగర్, మారుతి నగర్, సీతానగర్, హరిజన బస్తీ, వినాయక్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లు కోరారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకుడు ఈటీ నరసింహ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బిజెపితో అంతర్గత ఒప్పందం చేసుకున్నదని ఆరోపించారు. కేటీఆర్ ఓటమి భయంతో వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, విద్యా, నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధిగా ఉందని, ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఏకగ్రీవంగా ఉన్నారని తెలిపారు.కేంద్రమంత్రి బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నాడని, ఎన్నికల కమిషన్ ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పాలనలో చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని సిపిఐ రాష్ట్ర నాయకుడు వి.ఎస్. బోస్ ఆరోపించారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి ప్రజల ఆస్తులు దోచుకున్నారని విమర్శించారు .ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఎస్. ఛాయదేవి, స్టాలిన్, కాంగ్రెస్ షేక్‌పేట్ ఇన్‌చార్జి క్రాంతి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, షేక్ షంషుద్దీన్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి మొండి వైఖరి తోనే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం : బేర బాలకిషన్



**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా ఉన్న మాల కులస్తులకు పూర్తిగా జరుగుతున్న అన్యాయానికి, ఎస్సీ వర్గీకరణ సవరణ బిల్లును అసెంబ్లీలో పెట్టి ఆమోదించి ఎస్సీలోని 59 కులాలకు సమానంగా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొండివైఖరికి నిరసనగానే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్, మాల సంఘాల జేఏసీ అభ్యర్థి బేర బాలకిషన్ తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా మంత్రులను, ప్రతిపక్ష నాయకులను, మేధావులను అందరిని కలిసి మాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని రమ్మని చెప్పి ప్రాధేయపడిన ఫలితం లేకుండా పోయిందని అని అన్నారు.. జీవో నెంబర్ 99 వల్ల 58 ఉప కులాలకు సంబంధించినటువంటి విద్యార్థులకు ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడు లేడని జీవో నెంబర్ 10 వల్ల.. ఎస్సీ విద్యార్థులకు మెరిట్ వచ్చి పోటీ పరీక్షల్లో నెగ్గిన అభ్యర్థులకు మెరిట్ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వకుండా మెరిట్ విద్యార్థులను కూడా రిజర్వేషన్ లోనే భర్తీ చేస్తున్నారని అన్నారు .మా పోరాటం వల్ల 59 కులాలకు న్యాయం జరగాలని ఆరాటమే తప్ప స్వార్థం లేదని.. ఎన్నికల ముందు గత ప్రభుత్వం దళిత బంధు పేరుమీద దళిత నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం ద్వారా పది లక్షలు ఇస్తే రేవంత్ రెడ్డి ఎన్నికల్లో అంబేద్కర్ అభయహస్తం పేరుతో 12 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా వ్యతిరేక గాలులు వీస్తున్నాయని, దళితులతో పార్టీ అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి తీవ్ర అన్యాయం చేసినారని ప్రజలు జూబ్లీహిల్స్ లో తమకు తెలియజేస్తున్నారని అని అన్నారు. సీసీ కెమెరాగుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి తెలంగాణ లోని జీవో నెంబర్ 99 వల్ల అన్యాయానికి గురవుతున్న 58 కులాల గొంతుకు అసెంబ్లీలో వినిపించడానికి తనను గెలిపించాలని బాలకిషన్ ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు.

## నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

**- సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు**



**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు అన్నారు. నవీన్ కుమార్ యాదవ్ మద్దతుగా దయాకర్ రావు కార్యకర్తలతో కలిసి యూసఫ్ గూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ను వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తర్వాత గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతో పాటు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తున్నారని మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడంతోపాటు వడ్డీ లేని రుణాలు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గౌస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



షామీర్పేట్ లోని ఎస్ ఎన్ ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్లో జస్వంత్ రెడ్డి, షేరిన్ ల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన వి3 ఛానల్, విశ్వంబర దిన-పత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ. ఆశీర్వదించిన వారిలో కూర రమేష్, శ్రీధర్ లు ఉన్నారు.

- విశ్వంభర, షామీర్పేట్

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం

08-11-2025

సంపుటి : 01 | సంచిక : 117 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







## పోలవరం ప్రాజెక్టు రెండు సొరంగాలను విస్తరించింది

- ఎలాంటి అనుమతులు లేకుండానే ఏపీ ప్రభుత్వం ఈ పనులు చేపట్టింది
- అన్ని రాష్ట్రాలు ఇలానే చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయి?
- తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్‌బొజ్జా తీవ్ర అభ్యంతరం
- పీపీఏ కార్యాలయం ఏపీ తరలింపునకు అంగీకారం..
- నిలిచిపోయిన బనకచర్ల నిర్మాణ పనులు


5

## వందేమాతరం గేయం ఒక సంకల్పం

- ఆ శబ్దం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది
- భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుంది
- ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుం: ప్రధాని మోదీ
- వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల

5



### కిషన్‌రెడ్డి, కేటీఆర్

# బ్యాడ్ బ్రదర్స్

## వీరిద్దరూ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

- కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ అభివృద్ధి
- ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు తీసుకొచ్చింది
- భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం
- కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు
- వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు
- పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా?
- వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు
- కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదు
- మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం..
- మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** 20042014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. “2014 నుంచి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది..

మిగతా5లో...



## రేవంత్ రెడ్డి ఓటమిని అంగీకరించారు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రెఫరెండం కాదన్నారు
- అటెన్షన్.. డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారు
- కాంగ్రెస్ ఓటమి ఖాయం అన్న మాట స్పష్టమైంది
- సబ్బండ వర్గాలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ ను అగ్రస్థానంలో నిలిపింది
- రేవంత్ పూర్తిగా పతనావస్థకు చేర్చారు
- హైడ్రా పేరుతో అరాచకం చేశారు
- పేదల ఇళ్లు కూలగొట్టి.. పెద్దవాళ్ల అక్రమాల జోలికి వెళ్లలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



5

## తెలంగాణలో అవకాశాలు పుష్కలం


- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశానికి రోల్ మోడల్
- లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుంది
- అమెరికా-యూటా పారిశ్రామికవేత్తలను కోరిన మంత్రి శ్రీధర్ బాబు

5



## బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు

- రంగరాజ నరసింహ తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు
- ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం
- ఆలయ ఈవో రాజ్యలక్ష్మి



5

### ప్రైవేటు కళాశాలల

## బంద్ విరమణ

- ప్రభుత్వంతో యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం
- రూ.600 కోట్లు తక్షణమే విడుదల చేస్తాం
- మిగిలిన రూ.300 కోట్లు కూడా త్వరలో క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ



5

## ఢిల్లీకి చేరుకున్న మయన్మార్ సైబర్ ఫ్రాడ్ బాధితులు

- సురక్షితంగా ప్రత్యేక విమానంలో 11మంది రాష్ట్రానికి చెందిన బాధితులు
- రాష్ట్ర అధికారులకు అధికారికంగా అప్పగింత

5



## హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

- ఒక్క నెలలో 55 మంది అరెస్టు
- నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం
- సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు
- చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తింపు

5



### ఈ ప్రమాదం

## మనసు కలిచివేసింది

- డ్రైవర్ తప్పిదం కాదు.. హైవే దుస్థితే ఈ ప్రమాదానికి కారణం
- 19 మంది ప్రాణాలు కోల్పోయారు
- మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- చేవెళ్ల బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించిన కవిత



5

# అలుపెరగని బిజెపి రథసారథి అద్వానీ

## కమలాన్ని గద్దెనెక్కించిన కురువృద్ధుడు

లాల్ కృష్ణ అద్వానీ..ఈ పేరే ఒక బ్రాండ్. 14ఏళ్లకే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో చేరి..జన్‌సంఘ్‌తో ప్రజలకు చేరువైన ప్రజానేత. గోరంత బిజెపిను కొండంత చేసిన అగ్రనేత. రెండు సీట్ల కాషాయ దళాన్ని ఢల్లీ పీఠం ఎక్కించిన అలుపెరగని రథసారథి. కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ)కు రూపకల్పన చేసిన రాజకీయ శిల్పి. కీర్తిప్రతిష్టలతో పాటు అపవాదును తన మకుటంలో నిలుపుకొన్న అయోధ్య ఉద్యమకారుడు. పార్టీతోపాటే ఎదిగి ఉప ప్రధాని అయిన రాజనీతిజ్ఞుడు! ప్రధాని కల తీరకుండానే అస్త్ర సన్యాసం చేసిన బిజెపి భీష్మ పితామహుడు.ఈ తరానికి చెందిన గొప్ప రాజనీతిజ్ఞులలో ఆయన ఒకరు. దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. క్షేత్రస్థాయి నుంచి జీవితాన్ని ప్రారంభించి..ఉప ప్రధానిగా దేశానికి సేవ చేశారు. పార్లమెంటులో ఆయన అనుభవం మనకు ఎన్నటికీ ఆదర్శప్రాయం. అద్వానీజీ సుదీర్ఘ రాజకీయ జీవితం నుంచి మనం ఎన్నో నేర్చుకోవచ్చు. జాతి ఐక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని పెంపొందించే దిశగా అసమాన కృషి చేశారు. రాజకీయ కురువృద్ధుడు, బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీని గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో గౌరవించింది. నేడు ఆయన జన్మదినం సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో విశ్వంభర ప్రత్యేక కథనం...



### 14ఏళ్లకే ఆర్ఎస్ఎస్‌లోకి...

అద్వానీ పూర్తి పేరు లాల్ కృష్ణ అద్వానీ. 1927 నవంబర్ 8న అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాక్‌లో ఉంది)లో జన్మించారు. అక్కడే సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. ఎల్‌కె అద్వానీకి స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉంది. 1941లో తన పద్నాలుగేళ్ల వయసులోనే ఆయన ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 1947లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ రాచీ విభాగం కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. అయితే, ఆర్ఎస్ఎస్‌తో ఆయన ప్రయాణం అనుకోకుండానే జరిగిందని తన ఆత్మకథలో చెప్పారు. అద్వానీ తండ్రి సింధ్ నుంచి హైదరాబాద్ (పాక్)కు మారారు. అప్పటికీ మెట్రిక్యులేషన్ పూర్తయిన అద్వానీ కళాశాలలో చేరడానికి ముందు సెలవురోజుల్లో టెన్నిస్ ఆడేవారట. అలా ఒకరోజు తన స్నేహితుడు ఆటమధ్యలో వెళుతుండగా.. 'ఎందుకు వెళ్లిపోతున్నావ్' అంటూ ఆయనను ప్రశ్నించారు. తాను ఆర్ఎస్ఎస్‌లో చేరానని, అనుకున్న సమయానికి వెళ్లాల్సిందేనని చెప్పాడు. అలా తొలిసారి ఆర్ఎస్ఎస్ పేరును అద్వానీ విన్నారు. తర్వాత దాని గురించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకొని తర్వాత ఓ రోజు ఆర్ఎస్ఎస్ శాఖకు హాజరయ్యారు. అలా ప్రారంభమైన తన జీవితం.. సంఘ్‌కు అంకితమైందని తన ఆత్మకథలో ఆయన వివరించారు. పాక్‌లోని హైదరాబాద్‌లో గల డిజి నేషనల్ కాలేజీలో న్యాయవిద్యను పూర్తి చేశారు. దేశ విభజన తర్వాత ముంబయిలో స్థిరపడ్డ అద్వానీ..రాజస్థాన్‌లో సంఘ్ ప్రచారక్‌గా పనిచేశారు. 1957లో ఢల్లీకి వెళ్లి జన్‌సంఘ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1966లో ఢల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించారు. 1967లో ఢల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా గెలిచారు. 197072లో భారతీయ జనసంఘ్ ఢల్లీ విభాగం అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆర్గనైజర్ అనే పత్రికలో నేషనల్ ఎగ్జిక్యూటివ సభ్యుడిగా పనిచేశారు. రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంట్‌లోకి.. 1970లో ఢల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారు. 1976లో గుజరాత్ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లారు. 197780లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆపార్టీ ప్రభుత్వంలో 197779 వరకు సమాచార, ప్రసార శాఖ మంత్రిగా పనిచేశారు. 1980లో జనతా పార్టీ ఓటమి పాలైన అనంతరం రాజ్యసభలో కొంతకాలం పాటు ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు.



### బిజెపిని స్థాపించి..

1980లో అద్వానీ సహా కొంతమంది జన సంఘ్ నేతలు జనతా పార్టీని వీడారు. ఆ తర్వాత వాజ్‌పేయితో కలిసి 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీని స్థాపించారు. 1982లో మధ్యప్రదేశ్ నుంచి మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించింది. వాజ్‌పేయి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కానీ, ఆ ప్రస్తుతం 13రోజులకే కూలిపోయింది. ఆ తర్వాత 1998లో మిత్రపక్షాలతో కలిసి బిజెపి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1999లో జరిగిన ఎన్నికల్లో గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి అద్వానీ గెలిచారు. ఓటమితో నిరుత్సాహపడకుండా విజయం కోసం అద్వానీ అహర్నిశలూ శ్రమించారు. ఆయనలోని ఆ పోరాట పటిమ, క్రమశిక్షణ వెనక రాష్ట్రీయ స్వయంసేవక్ మూలాలూ ఓ కారణం. ఆ సంస్థతో ఆయనది సుదీర్ఘ అనుబంధం. అయితే, సంఘ్‌లో అద్వానీ చేరిక కూడా అనుకోకుండా జరిగిందే. ఈ విషయాన్ని ఆయనే తన ఆత్మకథ 'మై కంట్రీ మై లైఫ్'లో పేర్కొన్నారు.

### లోక్‌సభలో సుదీర్ఘ కాలం ప్రతిపక్ష నేతగా..

2004 ఎన్నికల్లో బిజెపి ఓటమిపాలవ్వడంతో అద్వానీ ప్రతిపక్ష నాయకుడిగా నియమితులయ్యారు. లోక్‌సభలో సుదీర్ఘకాలం పాటు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో బిజెపి ప్రధాని అభ్యర్థిగా పోటీ చేశారు. కానీ, ఆ ఎన్నికల్లో కాషాయ దళం ఓడిపోయింది. 2014లో మరోసారి గాంధీ నగర్ నుంచి గెలుపొందిన అద్వానీ.. 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.

### హిందుత్వ పోస్టర్ బాయ్...

భారతీయ జనతాపార్టీకి అచ్చమైన హిందుత్వ పోస్టర్ బాయ్ అద్వానీనే..అసలు పార్టీకి హిందుత్వ రంగు అద్దిందే ఆయన. 1983నాటికి లోక్‌సభలో కాషాయ పార్టీకి కేవలం రెండే రెండు సీట్లు దక్కాయి. అలాంటి కష్టకాలంలో పార్టీ పగ్గాలను అందుకున్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ..అంతర్గత కలహాలు, అవినీతి వంటి సమసయల్లో చిక్కుకుంది. వాటిని గమనించిన అద్వానీ..బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు హిందూ ఓటు బ్యాంకును ఆకర్షించాలని నిర్ణయించారు. ఆ అజెండాను తెరపైకి తెచ్చారు. అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించాలని నినదించారు. 1989లో రథయాత్రకు శ్రీకారం చుట్టారు. ఆయన చేపట్టిన రథయాత్ర ఓ వర్గం ఓట్లను సంఘటితం చేసింది. బిజెపి గెలుపునకు బాటలు వేసింది.

### కమ్యూనిస్టులతో అధికారం..

బిజెపి, కమ్యూనిస్టులంటేనే ఉప్పూనిప్పూ వ్యవహారం. ఆరెండు పార్టీల మధ్య వైరం ఇప్పటిది కాదు. అలాంటి కమ్యూనిస్టులతో నాటి జన సంఘ్ (బిజెపికి పూర్వ రూపం) అధికారం పంచుకుందంటే ఆశ్చర్యమే. అదీ అద్వానీ హయాంలోనే జరగడం గమనార్హం. అది 1958. ఢల్లీ కార్పోరేషన్‌కు జరుగుతున్న తొలి ఎన్నికలు. అప్పట్లో కాంగ్రెస్, జన సంఘ్‌లు పోటీపడ్డాయి. అధికారాన్ని నిర్ణయించగల స్థాయిలో సిపిఐ ఉండేది. సంఘ్‌ను దూరం పెట్టేందుకు కాంగ్రెస్‌తో సిపిఐ పొత్తు కుదుర్చుకుంది. అరుణా అసఫ్ అలీని ఢల్లీ మేయర్‌గా ఎన్నుకుంటేనే మద్దతిస్తామని సిపిఐ ప్రకటించడం..అందుకు కాంగ్రెస్ అంగీకరించడంతో అధికార పీఠం జన సంఘ్ చేజార్చుకుంది. ఏడాది తిరగకముందే అంతర్గత కుమ్ములాటల వల్ల ఏడాదిలోనే పొత్తు ముగిసింది. దీంతో కమ్యూనిస్టులతో జన సంఘ్ కు వ్యూహాత్మక పొత్తు కుదిరింది. ఈ విషయంలో అద్వానీ కీలకంగా వ్యవహరించారు. హిందూ మహాసభకు చెందిన సభ్యుడితో పాటు కొందరు స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో మేయర్,డిప్యూటీ మేయర్ పదవులను రెండు పార్టీలు పంచుకున్నాయి. రొటేషన్ పద్ధతిలో అధికారాన్ని మార్చుకునేందుకు ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. 1998లో మిత్రపక్షాలతో కలిసి కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అద్వానీ హోంమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. మార్చి 19న ప్రమాణ స్వీకారం చేశారు. అదే రోజు సాయంత్రం కమ్యూనిస్టు నేత, కేరళ మాజీ సిఎం ఈఎంఎస్ నంబూద్రిపాద్ మరణించారని సమాచారం వచ్చింది. ప్రధాని వాజ్‌పేయి స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. పార్టీ పరంగా తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నందుకు ఆయనను ఎంతో గౌరవించేవాడినని తన ఆత్మకథలో పేర్కొన్నారు. మర్నాటు ఉదయం ఈఎంఎస్ అంత్యక్రియలు జరిగాయి. భారత ప్రభుత్వం తరపున అద్వానీ నివాళులర్పించారు. తన ఆత్మకథలో ఈరెండు సందర్భాలను ఆయన ప్రస్తావించారు.



### పార్టీకి పలుమార్లు రాజీనామా...

బిజెపికి చుక్కానిలాంటి అద్వానీ..సొంత పార్టీకి రాజీనామా చేశారంటే తెలియని వారికి ఆశ్చర్యమేస్తుంది. మూడుసార్లు ఆయన అలా పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం. 2005లో తొలిసారి రాజీనామా చేశారు. పాక్ వ్యవస్థాపకుడు జిన్నాను లౌకికవాది అంటూ కొనియాడారు. పాక్‌లోనూ పర్యటించారు. ఈ వ్యాఖ్యలు బిజెపితోపాటు, ఆర్ఎస్ఎస్ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పార్టీ సహచరులే తన వెంట నిలవకపోవడం తనను ఎంతో బాధించిందని తన ఆత్మకథలో పేర్కొన్నారు. దీంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తూ పార్టీకి రాజీనామా చేశారు. ఇలా పార్టీలో కొన్ని అంశాలతో విభేదించిన అద్వానీ మూడుసార్లు పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం.

### బహుదూరపు బాటసారి...

కేంద్రంలో కమలం పార్టీని గద్దెనెక్కించేందుకు అద్వానీ అనేక రథయాత్రలు చేపట్టారు. రామరథ యాత్ర నుంచి మొదలుపెట్టి ఆరు యాత్రలు చేశారు. కాంగ్రెస్ అవినీతి, విపి సింగ్ 'మండల్ రిజర్వేషన్'.. తదితర అంశాలతో సతమవుతున్న దేశ ప్రజలను సమీకృతం చేయడానికి 1990 సెప్టెంబర్ 25న గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి ఆయన రామరథ యాత్రకు శ్రీకారం చుట్టారు. బాబ్రీ మసీదు ఉన్న స్థలంలో రామమందిరాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. తనయాత్రను అయోధ్యలో ముగించాలని భావించినా..బీహార్‌లో అప్పటి ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆయనను అరెస్టు చేయడంతో రథ యాత్ర మధ్యలోనే ముగిసిపోయింది. ఈరథయాత్ర 1991 ఎన్నికల్లో బిజెపికి బాగా కలిసొచ్చింది. లోక్‌సభలో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రతిపక్ష నేతగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 1992లో బాబ్రీ విధ్వంసం తర్వాత బిజెపి కేంద్రంలో అధికారానికి దగ్గర చేసింది. 1993లో అద్వానీ చేపట్టిన జనాదేశ్ రథయాత్ర. ఆతర్వాత స్వర్ణ జయంతి రథయాత్ర, భరత్ ఉదయ్ యాత్ర, భారత్ సురక్షా యాత్ర వంటివి బిజెపికి కలిసొచ్చాయి. 1996లో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. 1984లో రెండు సీట్లతో ఉన్న ఆపార్టీ.. అద్వానీ, వాజ్‌పేయి నాయకత్వంలో 161 స్థానాలను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఇక, 2011లో యూపిఏ అవినీతికి వ్యతిరేకంగా జన చేతన యాత్రల పేరిట మరో రథయాత్ర చేశారు.



**తనదైన శైలి ప్రసంగాలతో ఆకట్టుకున్న అద్వానీ**

తనదైన ప్రసంగాలతో ఆకట్టుకునే అద్వానీకి అసలు హిందీ వచ్చేది కాదట. భారత్‌కు వచ్చేవరకు ఆయనకు హిందీలో అసలు ప్రావీణ్యమే లేదట. హిందీ సినిమాలు చూడడం ద్వారా భాషను అర్థం చేసుకొని వచ్చీరాని భాషలోనే నెట్టుకొచ్చేవారు. 1947 తర్వాత తన 20వ ఏట భారత్‌కు వలస వచ్చిన తర్వాతే హిందీ చదవడం, రాయడం నేర్చుకున్నానని ఆత్మకథలో వివరించారు. ఆ తర్వాత అదే హిందీలో ఆయన అనర్గళంగా మాట్లాడటమే కాదు.. తనదైన శైలి ప్రసంగాలతో ఎంతోమందిని ఆకట్టుకున్నారు కూడా.

### ఆ కల మాత్రం తీరలేదు..

దేశానికి ప్రధాని కావాలని పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అద్వానీ కలలు కన్నారు. 1999లో వాజ్‌పేయి ప్రధాని కావడంతో ఆయన ఉప ప్రధాని పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2004 ఎన్నికల్లో నైనా ప్రధాని పదవిని అధిష్ఠించాలని అనుకున్నారు. ఇందులో భాగంగానే ' భారత్ వెలిగిపోతోంది' నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ముందుగానే ఎన్నికలకు వెళ్లారు. కానీ, ఆ ఎన్నికల్లో కమలానికి ఓటమి తప్పలేదు. ఆ తర్వాత 2005లో పాక్‌కు వెళ్లి జిన్నా లౌకికవాది అని పొగడటం వివాదంగా మారింది. ఈ క్రమంలోనే అద్వానీ నేతృత్వంలోని బిజెపి 2009లో మరోసారి పరాజయం పాలైంది. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. 2014లో తన కల నెరవేరుతుందని ఆశించినా అది జరగలేదు. చివరకు 2019లో క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు.




పోతుగంటి వెంకటరమణ
అసోసియేట్ ఎడిటర్,
విశ్వంభర దినపత్రిక

# కోడి అమెరికన్లకు.. కాళ్లు మనకు

ఆ కాళ్లు తాజావి కూడా కావు.కనీసం ఒక వారం క్రితం కోసిన కోడికి సంబంధించిన కాళ్లు అవి. కోడి శరీరంలోని మిగతా మాంసాన్ని వాళ్లు వండుకొని ఎంతో ప్రీతితో భుజించి, మిగిలిన కాళ్లను మాత్రం మన లాంటి దేశాలకు అంట గడతారు అదే ఎగుమతి చేస్తూ ఉంటారన్నట్లు. ఆ కాళ్లు సముద్ర మార్గాల్లో మన వద్దకు చేరుకుంటాయి. ఓడ రేవుల్లోకి చేరుకొని అక్కడి నుంచి గోదాముల్లోకి, అటు నుంచి కే.ఎఫ్.సీ, మెక్ డోనాల్డ్స్ లాంటి ఖరీదైన రెస్టారెంట్లకు చేరుకుంటాయి. ఈ రెస్టారెంట్లలో కేవలం కోడికాలి మాంసం మాత్రమే లభిస్తుంది. కోడి శరీరంలోని ఇతర భాగాల మాంసం అక్కడ ఉండదు. కోడిని కోసిన సమయం నుంచి అవి ఇండియా లోని రెస్టారెంట్లకు చేసుకోవడానికి కనీసం వారం రోజుల సమయం పడుతుంది. అప్పుడు ఆ కోడి కాళ్ల [లెగ్ పీస్] మాంసాన్ని రకరకాల వంటలుగా అనేక మసాలాలు దట్టించి వండి వార్చి వడ్డిస్తారు. వాటిని మన జనాలు లొట్టలు వేసుకుంటూ భుజిస్తారు. వారం రోజుల పాటు డీప్ ఫ్రీజర్లలో నిల్వ చేసిన (పాచిపోయిన) ఈ కోడి కాళ్ల మాంసం చవకగా ఏమీ లభించదు. మూడు నాలుగు ముక్కల కనీస పరిమాణం కలిగిన డిష్‌కు వంద రూపాయల వరకు వసూలు చేస్తాయి ఆ రెస్టారెంట్లు. పరిమాణాన్ని బట్టి ఒక్కో డిష్‌కు ఒక్కో ధర ఉంటుంది. చిల్లర మార్కెట్ లో కోడి మాంసం కిలో ధర సుమారుగా రూ. 200 వరకు ఉంటుంది.ఇక్కడేమో మూడు నాలుగు ముక్కల మాంసానికే వంద నుంచి రెండు వందలు చెల్లించవలసి వస్తున్నది. ఇలా ఆ కోడి కాళ్ల మాంసాన్ని వండి వార్చి విక్రయించే దుకాణాలు/రెస్టారెంట్లు ఇప్పుడు ఇండియాలోని మెట్రో నగరాలకే పరిమితం కాలేదు. రెండవ శ్రేణి నగరాలు, చిన్న చిన్న పట్టణాలకు కూడా బాగా విస్తరించి పోయాయి. ఆ





మాంసానికి ఇప్పుడు బాగా గిరాకీ పెరిగి పోయింది. ఈ కోడి కాళ్ల మాంసాన్ని భుజించడానికి పల్లెల నుంచి నగరాలు, పట్టణాలకు వచ్చే యువత కూడా ఇప్పుడు పెరిగి పోయింది. కోడి భుజించిన ఆహారంలో ఎక్కువ భాగం కొవ్వుగా మారిపోయి కాళ్లలోకి చేరుకుంటుంది. అమెరికాలో కోళ్ల పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. అలా అభివృద్ధి చెందిన కోళ్ల పరిశ్రమ ద్వారా వాళ్లు భుజించని కాళ్లు పార వేయలేరు కదా. అలా వాళ్ల భుజించని వృథాగా ఉండే మిగులు కాళ్ల మాంసాన్ని మన లాంటి దేశాలకు అంటగట్టి కోళ్ల పరిశ్రమను కాపాడుకుంటూ జేబులు నింపుకుంటున్నది అమెరికా. కొవ్వు ఎక్కువగా పేరుకు పోయిన కాలి మాంసం భుజించడం క్షేమం కాదనే ఆరోగ్య స్పృహతో లెగ్ పీస్‌లను అసలే ఇష్టపడరు, భుజించరు.ఇలా అమెరికా తమ దేశ మిగులు ఉత్పత్తులను వదిలించు కోవడానికి, ఇతర దేశాలకు అంటగట్టి జేబులు నింపుకునేదే అమెరికా అంతర్జాతీయ వాణిజ్య నీతి అన్నట్లు. ఇదీ స్థూలంగా ఇండియాలో విక్రయించే అమెరికా కోడి కాళ్ల కథ.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

## డయాబెటిస్, ఒబెసిటీ ఉంటే..

# అమెరికా వీసా కష్టమే..!




అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కొత్త రూల్ తీసుకొచ్చారు. డయాబెటిస్ , ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

సాధారణంగా అమెరికా వీసా \ కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వనరులపై అదనపు భారం పడే అవకాశమున్న దరఖాస్తుదారులను అమెరికాలోకి రానివ్వకుండా వీసాను తిరస్కరించేలా నిబంధనలను కఠినతరం చేసినట్లు సమాచారం.''దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ అప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలి'' అని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు.అంతేకాదు.. ఒకవేళ వలసదారులు అమెరికా ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది కూడా నిర్ధరించుకోవాలని వీసా అధికారులను ఆదేశించారు. ఇక, కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.

ఇప్పటికే వలసదారులకు సంబంధించి అమెరికా యంత్రాంగం కఠిన విధానాలను అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజీ విజిటర్ల 'డ్యురేషన్ ఆఫ్ స్టే'పై పరిమితి విధించడం, హెచ్1బీ వీసాపై వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేశాయి.

## పోలవరం ప్రాజెక్టు రెండు సొరంగాలను విస్తరించింది

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన రెండు సొరంగాలను 20,000 క్యూసెక్కుల నుండి 40,000 క్యూసెక్కులకు, కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసీ)ను 10,000 క్యూసెక్కుల నుండి 17,548 క్యూసెక్కులకు విస్తరించింది.. ఎలాంటి అనుమతులు లేకుండానే ఏపీ ప్రభుత్వం ఈ పనులు చేపట్టిందని తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) 17వ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్, కేజీబీవో కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించారు. ఈ సమావేశానికి పీపీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈఓ) అతుల్ జైన్ అధ్యక్షత వహించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జలశక్తి మంత్రిత్వ శాఖ (ఎంఓజేఎస్) తదితర విభాగాల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. రాష్ట్రం తరఫున ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాతోపాటు తదితర అధికారులు పాల్గొన్నారు. ఏపీ నుండి భూసేకరణ (ఎల్ఏ), పునరావాస (ఆర్ఆర్) కమిషనర్ పురోగతిని వివరించారు.

**విస్తరణలపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం..**

ముందుగా.. తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ సొరంగం, కాలువల విస్తరణ పనులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి రాష్ట్రం ఇలా చేస్తే, పరిణామాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు కూడా ఇలాగే చేస్తే దిగువకు నీరు వస్తుందా అని ప్రశ్నించారు. ఈ తరహా చర్యలను తాము వివిధ వేదికల్లో వ్యతిరేకిస్తున్నామని, అధికారులకు అనేక లేఖలు రాస్తున్నామని తెలిపారు. ఈ అంశంపై పీపీఏ మెంబర్ సెక్రటరీ గతంలో అనేక లేఖలు రాశారని, సమావేశ మినిట్స్‌లో నమోదు చేశారని చెప్పారు. విస్తరణలను, నిర్మాణాన్ని ఆపలేకపోయిందని ఆరోపించారు. ఇటువంటి కార్యకలాపాలను అరికట్టడానికి చర్యతోపాటు ఒక పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.

**పీపీఏ కార్యాలయం తరలింపును అంగీకారం..**

పీపీఏ కార్యాలయాన్ని ఏపీకి తరలించేందుకు ఈ సమావేశంలో అంగీకరించారు. హైదరాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరానికి తరలించే అంశంపై 16వ పీపీఏ సమావేశంలోనే అంగీకరించారు.. ఈ విషయాన్ని తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ ధ్రువీకరించారు. అలాగే.. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన పర్యావరణ అనుమతులపై స్టే ఆర్డర్ పొడిగించిన నేపథ్యంలో ఎఫ్ఆర్ఎల్ స్థాయి 45.72 మీటర్ల వరకు భూసేకరణ, పునరావాస కోసం ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న జాయింట్ సర్వే స్థితిపై చర్చించారు. అయితే.. ఫేజ్ I (41.15 మీ) కింద ముంపునకు గురికాని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జాయింట్ సర్వే పూర్తయినప్పటికీ, తమ రాష్ట్రంలో ఎందుకు అలాంటి సర్వే ప్రతిపాదించబడలేదని తెలంగాణ అధికారులు ప్రశ్నించారు.

**భద్రాచలం, డ్రైనేజీ సమస్యలు..**

భద్రాచలం, డ్రైనేజీ సమస్యలపై సుప్రీంకోర్టు 2022 సెప్టెంబర్ నెలలో పలు ఆదేశాలు జారీ చేసిందని.. తెలంగాణ రాష్ట్రంలో రక్షణ పనులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయని, డ్రైనేజీ రద్దీ అధ్యయనం కోసం 6 పెద్ద వాగుల సర్వే ఇంకా జరగాల్సి ఉందని తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. ఈ సర్వే తర్వాత 8 వాగులు (6 పెద్ద వాగులు + కిన్నెరసాని, ముర్రేడువాగు) సరిహద్దు నిర్ణయ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఫేజ్ I (41.15 మీటర్లు) నిల్వ వరకు ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే, భద్రాచలం పట్టణం గుండా నీరు వెళ్లే ఏటపాక అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ (సిల్ లెవెల్ 40.250) మునిగిపోతుందని, దీనివల్ల గోదావరి నదిలోకి నిరంతరం పంపింగ్ అవసరమవుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై సీఈఓ అతుల్ జైన్, ఈ అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను సందర్శించి నివేదిక ఇచ్చేందుకు తెలంగాణ, ఏపీ అధికారులతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనను తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ అంగీకరించారు. వీటితోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014, సెక్షన్ 90(4) ప్రకారం ప్రాజెక్టు అనుమతులు పొందడానికి పీపీఏ మాత్రమే అధీకృత సంస్థ అని నొక్కి చెప్పారు.

**నిలిపిపోయిన బనకచర్ల..**

పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ అంశాన్ని ఈ సమావేశంలో తెలంగాణ లేవనెత్తింది. పీబీఎల్‌పీకి మూలం పోలవరం ప్రాజెక్ట్ అని, అయితే.. ఈ ప్రాజెక్ట్ పరిధి కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఆమోదాలకు అనుగుణంగా లేదని పేర్కొంది. తెలంగాణ అడిగిన ప్రశ్నకు ప్రతిస్పందనగా పోలవరం రిజర్వాయర్ ఫోర్‌షోర్ నుండి 23 టీఎంసీల నీటిని తరలించేందుకు ఉద్దేశించిన ఎత్తిపోతల పథకం (ఎల్ఐఎస్) అని ఏపీ అధికారులు వెల్లడించారు. అయితే.. ప్రస్తుతం దాని నిర్మాణ పనులు నిలిపివేయబడ్డాయని ధ్రువీకరించారు.

## హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

**విశ్వంభర, హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ.62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు. 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ.1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ.24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# కిషన్‌రెడ్డి, కేటీఆర్ బ్యాడ్ బ్రదర్స్

(3వ పేజీ తరువాయి)

ఎవరు? ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేది. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదు.

భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం.

**వారిద్దరినీ బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు..**

2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్



తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం..**

''కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలి? హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం'' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో అవకాశాలు పుష్కలం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని.. ఇక్కడ అవకాశాలు పుష్కలమని.. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా యూటా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని యూటా పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సెక్రెటేరియట్‌లో మంత్రిని ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో యూటాతెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్‌టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామిక



వేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టీహబ్, టీ వర్క్స్, వీ హబ్‌లను వరల్డ్ ట్రేడ్ సెంటర్‌యూటా, సిలికాన్ స్లోప్స్ అండ్ యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్ లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచిగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణలాంటి ఫాస్ట్ గ్రోయింగ్, డైనమిక్, ప్రో యాక్టివ్ రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ చెప్పారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కోఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ వుడ్, సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మినారాయణ, ఐఆర్ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.

## బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు

**విశ్వంభర, చెన్నై :** తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ మేనేజ్‌మెంట్ స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. ''ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ.. తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం'' అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటుచేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో బుధవారం ఆలయ ఈవో రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటల పాటు విచారించారు. ఆలయంలోని ఇతర



సిబ్బందిని కూడా ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆలయ ఈవో, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

## వందేమాతరం గేయం ఒక సంకల్పం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. ''వందేమాతరం శబ్దం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుంది. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుంది'' అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోడీ అన్నారు. ''వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి'' అని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది.

## ఈ ప్రమాదం మనసు కలిచివేసింది



**విశ్వంభర, చేవెళ్ల :** చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత మాట్లాడుతూ .. "ఈ ప్రమాదం మనసు కలిచివేసింది. రోడ్డు పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. రోడ్డు సరిగా లేని కారణంగానే ఈ దుర్ఘటన జరిగింది" అన్నారు. "నేషనల్ హైవే 163 రహదారి చాలా ఇరుకుగా ఉంది. ఈ రహదారి విస్తరణ చాలా కాలం క్రితమే జరగాల్సింది. కానీ పర్యావరణ అంశాలపై కేసులు రావడంతో పనులు ఆగిపోయాయి. అంతేకాకుండా, గత ప్రభుత్వంలో నేవీ రాడార్ స్టేషన్‌కు అనుమతి ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో భారీ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రారంభించాయి. రోడ్డు ఒక వైపుకి కుంగిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగింది," అని కవిత తెలిపారు. అలాగే, "డ్రైవర్ తప్పిదం కాదు.. హైవే దుస్థితే ఈ ప్రమాదానికి కారణం. సరైన రోడ్డు లేకపోవడం వల్ల 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలి. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి," అని డిమాండ్ చేశారు.

## ప్రైవేటు కళాశాలల బంద్ విరమణ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. యాజమాన్యాలు కోరిన రూ.1,500 కోట్ల బకాయిలలో రూ.600 కోట్లు ఇప్పటికే విడుదల చేయగా, మరో రూ.600 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని, మిగిలిన రూ.300 కోట్లు కూడా త్వరలో క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలను ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్‌బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.

## ఢిల్లీకి చేరుకున్న మయన్మార్ సైబర్ ఫ్రాడ్ బాధితులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మయన్మార్ మయవాడీలోని సైబర్ నేరాల శిబిరాల్లో చిక్కుకున్న రాష్ట్ర పౌరులు శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు. భారత వైమానికదళ ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చెందిన 11మంది బాధితులు సురక్షితంగా చేరుకున్నారు. వారిని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు గ్రేటర్ నోయిడాలో సంబంధిత రాష్ట్ర అధికారులకు అధికారికంగా అప్పగించారు. విచారణ ధృవీకరణ అనంతరం తెలంగాణకు చెందిన వారిని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులకు అప్పగించారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తో పాటు పలు జిల్లాల వారు ఈ బృందంలో ఉన్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపారు. వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ తరలించేందుకు ప్రయాణ ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు జాము వరకు హైదరాబాద్ చేరుకోన్నారు.

# రేవంత్ రెడ్డి ఓటమిని అంగీకరించారు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పోలింగ్ కంటే ముందే రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని.. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికలు తనకు రెఫరెండం కాదని చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావునగర్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి తన పాలనపై నమ్మకం లేక.. ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం కాదని చెప్పారని అన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అన్న మాట స్పష్టమైనదని చెప్పారు. అంతేకాదు.. సీఎంకు దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పుకోరాలని సవాల్ విసిరారు. తాను చేసింది ఏమీ లేకపోవడంతోనే రేవంత్‌రెడ్డి అటెన్షన్.. డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

**ఆరు గ్యారంటీలతో అందరికీ మోసం..**

రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత 24 నెలల కాలంలో చేసిందేమీ చెప్పుకునేందుకు లేకపోవడంతోనే పాత కాలం కథలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ రెండేళ్లలో అన్ని రంగాల్లో ప్రజలకు కష్టాలు తప్పడం లేదని.. సబ్బండ వర్గాలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశా



రన్నారు. విద్యార్థులు, యువకులు, రైతన్నలు, పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాన్ని చూసినందుకు రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు ఓటు వేయాలా అని ప్రశ్నించారు. హైదరాబాదు నగరాన్ని అథఃపాతాళానికి తీసుకువెళ్లినందుకు నగర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయాలా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో గెలిపిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలపై మండిపడ్డారు. గతంలోనూ ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని గుర్తు చేశారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము అడిగితే.. రేవంత్‌రెడ్డి తనకు సంబంధంలేని గత ప్రభుత్వపు కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం వంటి అన్ని రంగాల్లోనూ గత ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపిందన్నారు. కానీ.. రేవంత్ పూర్తిగా పతనావస్థకు చేర్చారని అన్నారు.

**పేదలే లక్ష్యంగా హైడ్రా కూల్చివేతలు..**

హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి అరాచకం చేశారని.. వేలాదిమంది పేదల ఇళ్లు కూలగొట్టిన పెద్దవాళ్ల అక్రమాల జోలికి వెళ్లలేదని కేటీఆర్ విమర్శించారు. కేవలం పేదలను లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇళ్లను కూలగొడుతున్న హైడ్రా బుల్డోజర్ పేద వాళ్ల ఇంటికి బస్తీల జోలికి రావద్దు అంటే 11వ తేదీన జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా మంత్రులు అక్రమంగా నిర్మించుకున్న ఫామ్‌హౌస్‌లను, ఇళ్లను కేటీఆర్ తన రోడ్డు షోలో అందరికీ అర్థం అయ్యేలా ఎల్ఈడీ స్క్రీన్‌లపై చూపించారు. హైడ్రా గురించి గొప్పగా చెప్పుకున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే సిగ్గు ఉంటే తన మంత్రుల అడ్డగోలుగా అక్రమంగా కట్టుకున్న ఈ నిర్మాణాలను తొలగించాలని సవాల్ చేశారు. హైడ్రా వలన ఒక్కరికి కూడా లాభం జరగలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్టీఆర్ పేరును ఎత్తే నైతిక అర్హత లేదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా భారీ మెజారిటీతో గెలిచిన ఎన్టీఆర్‌ను పదవి నుంచి తొలగించిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి పెట్టిన ఎన్టీఆర్ పేరును తొలగించి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ పేరు పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ గనుక ఎన్టీఆర్ విగ్రహాలను పెడితే ఆయన ఆత్మ ఘోషిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలను పీల్చుకుతింటున్న అరాచకానికి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్‌ను తరమాల్సిన అవసరం ఉందన్నారు.

# ఎర్రగడ్డలో చేర్పించాల్సిన బాధ్యత జూబ్లీహిల్స్ ప్రజలదే: హరీష్ రావు

**విశ్వంభర, పటాన్ చెరు:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక్కడికి వస్తే కుర్చీలు ఖాళీ ఉన్నాయి.. మన మీటింగ్‌కు మూడు సార్లు కుర్చీలు తెప్పించినా సరిపోవడం లేదని సెటైర్ వేశారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్స్‌కు పేరు కేసీఆర్ నగర్ అనే పేరు పెట్టుకున్నాం.. ఇన్ని ఇళ్లు చూసి అబ్బా కేసీఆర్ ఇంత పెద్ద ఇల్లు కట్టాడా? అని ఆశ్చర్య పోయారట. ఇన్ని రోజులు మంత్రులు వచ్చారా? అని అడిగారు. మాగంటి గోపీనాథ్ భార్య కన్నీళ్లు పెట్టుకుంటే కాంగ్రెస్ నాయకులు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ వాళ్ళు చనిపోతే భార్యలు ఏడుస్తారా లేదా? అని ప్రశ్నించారు. ఆ తల్లిని పట్టుకుని దుర్మార్గంగా మాట్లాడారు. ఆలోచనచేయండి..సిగ్గు లేకుండాఓట్లు అడుగుతున్నారని అన్నారు. అది ఇస్తాం, ఇది ఇస్తాం అని ప్రలోభాలు చేస్తున్నారు. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోతమా? అని అన్నారు. కలలో కూడా కలగనని ఇళ్లలో ఉంటామని అనుకోలేదు.. మీ ఓట్లు ఖాయంగా కేసీ ఆర్‌కే అని అర్థం అయ్యింది.. మీ బంధువులకు కూడా చెప్పి కేసీఆర్‌కు కారుకు ఓటేయమ్మని చెప్పండి అని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు రెఫరెండం అని చెప్పే ధైర్యం లేదు.. మంత్రులు జూపల్లి కృష్ణారావుకు, పొన్నం ప్రభాకర్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు చుక్కలు



చూపించారు..ఓటుకు రూ.3వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. తీసుకుని మిగతా రెండేళ్లలో ఇస్తామన్న డబ్బులు కూడా అడగండని చెప్పారు. రూ.2,500 లేదు, మహాలక్ష్మి స్కీమ్ లేదు, తులం బంగారం లేదు, స్కూటీ లేదు.. సిగ్గు లేకుండా మళ్ళీ ఏదో చేస్తా అని రేవంత్ రెడ్డి చెబుతున్నాడని విమర్శించారు. తులం బంగారం అడిగితే ఓ నేత లక్ష దాటింది ఎక్కడ ఇస్తాం అని మాట్లాడుతున్నాడు. మరి అలాంటప్పుడు హామీ ఎందుకు ఇచ్చారని సీరియస్ అయ్యారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్ చేసిన అభివృద్ధి కనపడటం లేదంటే.. ఆయన అంధుడు అయినా ఉండాలే.. లేదంటే పిచ్చోడు అయినా అయి ఉండాలి. పిచ్చోడు అయితే జూబ్లీహిల్స్ ప్రజలు ఎర్రగడ్డలో చేర్చాలని సూచించారు. హిందూ అయినా ముస్లిం అయినా కేసీఆర్‌కు ఒక్కటేనని అన్నారు.

## నవీన్ యాదవ్‌తో ప్రచారంలో పాల్గొన్న వరంగల్ కుడా చైర్మన్

**విశ్వంభర, హనుమకొండ:**



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఎర్రగడ్డ డివిజన్ లోని యాదవ కమ్యూనిటీ హాల్ లో యాదవ సోదరులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆనంద్ నగర్, బంజారా నగర్, ప్రేమ నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, జామియా మస్జిద్, నూర్ మస్జిద్, న్యూ సుల్తాన్ నగర్, నేతాజీ నగర్, రాజీవ్ నగర్ లలో గడప గడప ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు గణేష్ , భూపతి రెడ్డి , మధుసూదన్ రెడ్డి , తుడి మేఘ రెడ్డి , రాజేష్ రెడ్డి , ఎమ్మెల్సీ దండె విటల్, తాహిర్ బిన్ హాందన్ పాల్గొన్నారు.

## మైసగండి మైసమ్మ రథోత్సవం

**విశ్వంభర, కడ్తాల్:**



మండల పరిధిలోని మైసగండి గ్రామంలోని మైసిగండి దేవస్థానం బ్రహ్మోత్సవలలో భాగంగా మూడవరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో అమ్మవారికి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్ట్ చైర్మన్ శిరోలి వంతు నాయక్,బాస్కర్, జ్యోతి: అరుణ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, రాములు, కృష్ణ య్యానాయక్, మెంబర్ శ్రీనివాస్ డి, శ్రీరాము, అమ్నునాయక, పాండు, నాయక్, లింగప్ప, వెంకటేష్, పూజారులు, యాదగిరి, అమూల్య, సంతోష్, ప్రకాష్, వెంకటరమణ, శ్రీరాములు, శ్రీనివాసు, శ్రావణ, మహేష్, వెంకటేష్, రవి, చారి,శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన వందేమాతరం గీతాలాపన..

**విశ్వంభర,నెల్లికుదురు/ఇనుగుర్తి:**



బ్రిటిషర్ల గుండెల్లో గుబులు పుట్టించిన బంకించంద్ర చటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు నిండడంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆదేశంతో నెల్లికుదురు,ఇనుగుర్తి మండలాలల లోని గ్రామ గ్రామాన శుక్రవారం ప్రజలు వందే మాతరం గీతం ఆలపించారు. దీంతో భారత జాతి సమైక్యత మరోసారి వెల్లివిరిసినట్లయింది. చిన్ననాగారంలో పంచాయతీ కార్యదర్శి గండు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జీపీలో వందేమాతర గీతం ఆలపించారు. పంజాల వాసుదేవ, కొయ్యడి యాకాంతం,బైరు శ్రీనివాస్,బైరు ఉప్పలయ్య, యాకయ్య,కొయ్యడి వెంకన్న,నిడి గంటి చంద్రమౌళి, ఎల్లయ్య,బైరు సులోచన,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.శ్రీరామగిరిలో వివేకానంద సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో వందేమాతరం గీతా లాపనపై ప్రజలకు అవగాహన ,ప్రేరేపించడంతో కూలీలు పత్తి చేనులో పత్తి ఏరుతూ సమయం కాగానే వందేమాతరం గీతమా లపించారు. ప్రయాణంలో, ఇళ్లలో ఉన్న వారు గీతాలాపన చేశారు.యువతి యువకుల తో పాటు ఎక్కడికక్కడ వందేమాతరం గీతం చదివి దేశభక్తిని చాటుకున్నారు.

## కొమ్మారెడ్డి పట్టాభిరాంకు అపూర్వ స్వాగతం పలికిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**విశ్వంభర, పుట్టపర్తి:**
పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం శుక్రవారం విచ్చేశారు. ముఖ్యఅతిథిగా పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన స్వచ్ఛ ఆంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ కు ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ భగవాన్ సత్య సాయి బాబా చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి పుట్టపర్తి మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వచ్ఛం ద్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ డిఈ నరసింహా మూర్తి లు పనులను పరిశీలించారు. కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జ్ వద్ద నూతనం గా ఏర్పాటు చేస్తున్న కూరగాయల మార్కెట్ సంత మార్కెట్ వద్ద స్వచ్ఛంద కార్పొరేషన్ నిధుల తో మరుగుదొడ్లు మంజూరు చేస్తామని కొమ్మారెడ్డి పట్టాబిరామ్ హామీ ఇచ్చారు. అలాగే కూరగాయల వెస్ట్ ,చెత్త ను సేంద్రియ ఎరువులు తయారు చేసే కేంద్రాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాంత్ కుమార్ కు సూచించారు . పుట్టపర్తి అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొేంషన్ నిధులు మంజూరుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటా యని



ఆయన హామీ ఇచ్చారు. పుట్టపర్తి లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితోపాటు స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు బోయ రామాంజనేయులు , సామ కోటి ఆదినారాయణ గంగాధర్ నాయుడు, మండల కన్వీనర్లు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు , రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ , సింగల్ విండో అధ్యక్షులు విజయ్ కుమార్,గోపాల్ రెడ్డి, కన్వీనర్లు జయచంద్ర ,మల్లి రెడ్డి , రామకృష్ణ, మైలే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యత

**విశ్వంభర,సూర్యాపేట :**



సూర్యాపేట పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా చేయుటలో ముందుండాలి అని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి తెలిపారు. "స్వచ్ఛ సూర్యాపేట" కార్యక్రమం కింద శుక్రవారం ఉదయం స్థానిక 10 వ వార్డు కుప్పిరెడ్డి గూడెం లో నిర్వహించిన "పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత" నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు. ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరినీ ప్రజలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలు కూడా చురుకుగా ముందుకు రావాలని, "ప్రతి ఇంటి ముందే పరిశుభ్రత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వడం ద్వారా పట్టణం అందంగా, ఆరోగ్యవంతంగా ఉంటుంది" అన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో స్వచ్ఛత, పచ్చదనం, నీటి పరిరక్షణ వంటి అంశాలపై మున్సిపల్ శాఖ క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.శ్రమదానం కేవలం ఒక కార్యక్రమం కాదని, అది "స్వచ్ఛ సూర్యాపేట" లక్ష్యానికి మొదటి అడుగు అని పేర్కొన్నారు. పట్టణం అందంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు కలసి రహదారుల పక్కన ఉన్న చెత్తను, కలుపు మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, సానిటరీ ఇన్స్పెక్టర్ సార గండ్ల శ్రీనివాస్ సీనియర్ అస్సిటెంట్ జాన పాటి నాగయ్య,గౌసుద్దీన్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ ,టీఎంసీ శ్వేత ,వార్డ్ అధికారీ పల్లపు నరేష్ ,మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా మున్సిపల్ కమిషనర్ పిలుపుకు స్పందించి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని శుభ్రతకు తమ వంతు సహకారం అందించారు.

## స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాట స్ఫూర్తిగా నింపిన వందేమాతరం

**విశ్వంభర, ఆమనగల్లు:**
జాతీయ గేయం"వందేమాతరం" స్వరపరిచి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని అటల్ బిహారీ వాజ్పేయి చౌరస్తాల్లో విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్ వారితో కలిసి సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతరం స్ఫూర్తిని భావి తరాలకు అందించే బాధ్యత మనదే అని అన్నారు.మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది ం. బంకిమ్ చంద్ర ఛటర్జీ రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చింది. బ్రిటిషర్లను వందేమాతరం అనే మాటే భయపెట్టింది. భారతీయుల నోట మంత్రంలా మారిన వందేమాతరాన్ని పలికితే జైళ్ల పాల్జేశారు. ఈ రోజుకీ వందేమాతరం ఆలపించినా, విన్నా నరనరాన దేశభక్తి నిండుతుంది. ఒళ్ళు పులకరిస్తుంది. బంకిమ్ చంద్ర ఛటర్జీ మన జాతికి అందించిన ఆ గేయంలో ఉన్న శక్తి అది అని తెలిపారు.పోరాట స్ఫూర్తిని నింపిన వందేమాతరం గురించి భావి తరాలకు ఘనంగా తెలియచేయాలి. ఈ గేయం శుక్రవారం నాటికి 150 ఏళ్ళు పూర్తి చేసుకొంటుంది. దేశవ్యాప్తంగా నిర్దేశిత సమయంలో ప్రజలందరూ వందేమాతరం ఆలపించాలని ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.



వందేమాతరం స్ఫూర్తిని భావి తరాలకు అందించే బాధ్యత మనందరిదని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాజీ కౌన్సిలర్ జిల్లా కౌన్సిల్ నంబర్ చెక్కల లక్ష్మణ్, పూర్వ ఏబీవీపీ నాయకుడు సిరి శ్రీశైలం, నరేందర్ రాథోడ్, జంగయ్య, లండం మల్లేష్, గోజే ఆనంద్, వరికుప్పల శ్రీనివాస్, టిల్లు యాదవ్, ఎర్రవోలు మహేష్, మహేష్, నాగిల్ల సందీప్, ఆనంద్, శ్రీను హిందూ, గోరటి భరత్, నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రామన్నపేట కాంగ్రెస్ నాయకులు

**విశ్వంభర, రామన్నపేట:**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా తమ అమూల్యమైన ఓటు చేతి గుర్తు పై వేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ కు ఓటేసి గెలిపించాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కాంగ్రెస్ నాయకులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 95వ బూత్ లో ప్రచారం చేయడం జరిగింది. ఈ ప్రచారంలోరామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, బొడ్డు సాలయ్య, గోదా శ్రీమన్నారాయణ, కోటా సుధాకర్, మొహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## సామూహికంగా వందేమాతర గీతాలాపన

**విశ్వంభర,సూర్యాపేట:**
150 వసంతాల వందేమాతర ఉత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో 2000 మంది పౌరులు, విద్యార్థులు, పోలీసు సిబ్బందితో నిర్వహించిన భారీ ర్యాలీలో జిల్లా ఎస్పీ నర్సింహా పాల్గొని మాట్లాడారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక 60 ఫీట్ రోడ్డు నుండి వాణిజ్య భవన్ సెంటర్ వరకు వందేమాతరం నినాదాలు భారత్ మాతాకీ జై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం యొక్క స్థితిగతులను భారతదేశంలో ఉన్న పరిస్థితులను ప్రజల యొక్క అభిమతాన్ని తెలియపరుస్తూ బంకించంద్ర చటర్జీ గారు ఈ వందేమాతర గీతాన్ని రచించారు నేటికీ 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఘనంగా వ్యాధి నిర్వహించడం జరిగింది అన్నారు. వందేమాతర గీతం భారతదేశానికి స్వతంత్రం రాకముందు ప్రతి పల్లెలో ప్రతి పట్టణంలో కులమతాలకు అతీతంగా ప్రజలను చైతన్య పరిచి ముందుకు తీసుకువచ్చి ఐక్యతతో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడంలో ముఖ్య భూమిక పోషించిందని వందేమాతరం యొక్క గొప్పతనం ఈ పాట వలన ఎందరో త్యాగధనులు దేశం కోసం పోరాడిన గొప్ప చరిత్ర ఈ పాటకు ఉందని తెలియజేశారు సూర్యాపేట పట్టణంలో వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ ర్యాలీగా పాల్గొని వాణిజ్య భవన్ సెంటర్లో



జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, డిఎస్పి ప్రసన్నకుమార్, నరసింహ చారి, సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ ఐ లు మరియు పోలీసు సిబ్బంది, పట్టణ ప్రముఖులు,వందేమాతరం గీతాలాపన కమిటీ సభ్యులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ కుమార్, తోట శ్యామ్ ప్రసాద్, ప్రసన్న, దశరథ, సృజన కుమార్ , ఉపేందర్, వెంకట్ రెడ్డి, హైమవతి, శ్రీదేవి, నరసింహ,, మరియు వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వందే మాతరం 150 ఏళ్ల సంబరాలు

**విశ్వంభర, మేడిపల్లి:**



సిద్ధార్థ శ్రీ కృష్ణవేణి హై స్కూల్లా లో జాతీయ గీతం "వందే మాతరం" 150 ఏళ్ల సంబరాలు దేశభక్తి ఉత్సాహంతో, సాంస్కృతిక వైభవంతో ఘనంగా నిర్వహించబడ్డాయి "వందే మాతరం" స్వరాలతో, స్కూల్ ప్రాంగణం మారుమోగింది. విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో దేశభక్తి నినాదాలతో ఆవరణాన్ని ప్రతిధ్వనింపజేశారు.సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు వందే మాతరం గీతం చరిత్ర, దానిని రచించిన బంకిమ్ చంద్ర చటర్జీ గారి త్యాగస్ఫూర్తి, ఆ గీతం ద్వారా వెలుగులోకి వచ్చిన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి గురించి ప్రదర్శనలు ఇచ్చారు.ప్రిన్సిపాల్ పల్లికొండ గణేష్ మాట్లాడుతూ
"వందే మాతరం కేవలం ఒక గీతం కాదు, అది మన దేశ హృదయ స్పందన. తల్లి భూమి పట్ల గౌరవం, దేశ పట్ల ప్రేమ, త్యాగస్ఫూర్తి మన పిల్లలలో కలిగించడమే ఈ వేడుక యొక్క ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు.అలాగే ఆయన విద్యార్థులను ఉద్దేశించి "ప్రతీ విద్యార్థి తన చదువులోనే కాదు, తన దేశం కోసం కూడా ఆలోచించాలి. దేశభక్తి అంటే కేవలం గీతం పాడడం కాదు, మన భారత మాతకు గౌరవం చూపే ప్రతి చిన్న చర్య కూడా దేశ సేవే" అని తెలిపారు.చివరగా విద్యార్థులందరూ జాతీయ గీతం పాడుతూ "జై హింద్" నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

## ఎక్సైజ్ దాడుల్లో భారీగా గంజాయి, మద్యం స్వాధీనం

**విశ్వంభర, నాంపల్లి :**
నాంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో గంజాయి విక్రయాలపై సమాచారం మేరకు ఏస్టీఎఫ్ ఏటీమ్ అధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు జరిపి 1.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి, హట్‌గడే దశరథ్, కొమల్‌లను అరెస్టు చేశారు. యు.పింకి, అమన్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసిన గంజాయిని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఇక పహాడ్‌షరీఫ్ వద్ద సీ అండ్ డీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో 43 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వాటిని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో జమ చేశారు.అదే సమయంలో భద్రాచలం వద్ద ఆర్‌టిఏ చెక్‌పోస్ట్‌లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా, రెండు ద్విచక్ర వాహనాల్లో 18 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. సిద్దిపేట, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఐదుగురు యువకులు ఒడిశా నుండి గంజాయి తరలిస్తున్నట్లు నిర్ధారణ అయింది. వారికి కేసు నమోదు చేసి గంజాయి, వాహనాలను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల పర్యవేక్షణలో ఈ చర్యలు జరిగాయి. గంజాయి వ్యాపారంపై సమాచారం ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 18004252523కు తెలపాలని ఎక్సైజ్ అధికారి తెలిపారు.



# క్యాన్సర్ పై విజయం.. స్క్రీనింగ్ తోనే సాధ్యం

## జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్

**విశ్వంభర,మహబూబాబాద్:**
జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని సమాజం లో జీవన ప్రమాణాలు పెరగడం జీవన శైలి లో మార్పులు రావడం తో అసంక్రమిత వ్యాధులు (ఎన్సిడిఎస్- దీర్ఘ కాలిక వ్యాధులు)- పెరుగుతున్నాయని బి. పి., షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు కూడా గణనీయం గా నమోదు అవుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మారుతున్న ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం, వంశపారంపర్య కారణాలవల్ల ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేస్తూ వీటిలో చాలా కేసులు ఆలస్యం గా గుర్తించబడటం తో రేడియో , కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితి లో వుండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కుటుంబాలు ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి ని ఎదు ర్కొంటున్నాయని, బి. పి., షుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమనే భావనలో వున్నారో, అదే విధంగా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవడం లో వుండాలన్నారు. దీనికి ఒకే ఒక పరిష్కారం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మరియు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం" క్యాన్సర్ అంటే భయపడాల్సిన పని లేదని ముందుగానే గుర్తిస్తే కాన్సర్ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం 18 సంవత్సరాల పైబడిన వారందరికి ఉచితం గా నోటి, రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని మీ ఇంటి వద్దకు వస్తున్న ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని, మీ సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ పరీక్ష లు ఉచితం గా చేయబడునన్నారు. మీ వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏమైనా అనుమానాస్పద లక్షణాలు వుంటే వాటిని వెంటనే మెడికల్ కాలేజీ ఆసుపత్రులలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్స్ కి రిఫర్ చేసి తక్షణమే ప్రత్యేక ఉచిత వైద్య సదుపాయం, అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇది కొందరికే వస్తుంది, నాకు రాదు అనే అపోహలు వదిలేయండి.జిల్లా ప్రజలందరూ ముందుకు వచ్చి ఈ పరీక్షలు చేయించుకోండి. ముఖ్యంగా మహిళలు మొహమాటం, బిడియం తో వెనుకంజ వేయకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలి.



## ఘనంగా వందేమాతరం గీతాలాపన కార్యక్రమం

**విశ్వంభర, రామన్నపేట:**



వందేమాతరం గీతానికి 150 ఏళ్ళ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల తహసిల్దార్ సి.లాల్ బహదూర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, సబ్-ఇన్స్పెక్టర్ డి.నాగరాజు తదితరులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు సంస్థలు, ఇళ్ళల్లో ఉదయం 10:00 గంటలకు అందరూ వందేమాతరం గీతాలాపన చేయాలని పిలుపునిచ్చిందని, అందుకే ఈ వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వందేమాతర దినోత్సవం

**విశ్వంభర, కేసముద్రం:**



దేశభక్తి గీతమైన వందేమాతరానికి 150 సంవత్సరాలుపూర్తయిన సందర్భంగామండల కేంద్రంలోని, కల్వల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, లో వందేమాతర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమూహంగా వందేమాతరాన్ని పూర్తిగా ఆరాపించి దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, మాట్లాడుత"వందేమాతరం భారత జాతి ఉనికి, స్వాభిమానం, స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన గీతం. ఇది కేవలం పాట కాదు, ఇది మన జాతి ఆత్మ. బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయులు రాసిన ఈ గీతం ఆజాదీ ఉద్యమంలో దేశమంతా జ్వాలలా వ్యాపించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపింది" అని పేర్కొన్నారు.అలాగే విద్యార్థులు వందేమాతర గీతంలోని ప్రతి పదం వెనుక ఉన్న దేశప్రేమను అర్థం చేసుకోవాలని, దేశభక్తి విలువలను జీవితంలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పారిశుద్ధ్య సమస్యపై కలెక్టర్ ఆగ్రహం

## పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సస్పెన్షన్ చేయాలని ఆదేశం

**విశ్వంభర, సంగారెడ్డి:**
సంగారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ సమస్యపై కలెక్టర్ పి. ప్రావీణ్య, ప్రధానోపాధ్యాయులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో శానిటేషన్ సమస్య, ఎఫ్ఆర్ఎస్ సిస్టం సరిగా అమలు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పాఠశాలలో మూత్రశాలలు మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం తో పాటు , పాఠశాలలో శానిటేషన్ సమస్య కలెక్టర్ దృష్టికి రావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సస్పెన్షన్ చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ను ఆదేశించారు . పాఠశాలలో సానిటేషన్ సిబ్బందిని తొలగించి నూతన శానిటేషన్ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించారు . ఎఫ్ఆర్ఎస్ సిస్టం పూర్తిస్థాయి లో అమలు అయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఇప్పటి నుండే ఉపాధ్యాయులు, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు సిబ్బంది కృషి చేయాలని ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.



## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయిన మాంటిస్సోరి విద్యార్థినిలు

**విశ్వంభర, రాప్తాడు:**



రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో ఉన్నటువంటి మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల నందు 10వ తరగతి చదువుతున్న వి.యల్. స్వా తి అండర్ -17 కేటగిరి జిల్లా స్థాయిలో హ్యాండ్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9,10,11 తేదిలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుంది. ఈ సందర్భంగా వి.యల్. స్వాతిని పాఠశాల యమ్.డీ .కృష్ణ భరత్ , కరస్పాడెంట్ కృష్ణ సమీర, ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి అభినందించారు, కోచ్ అయినటు వంటి ఉదయ్ ని అభినందించడం జరిగింది.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయిన మాంటిస్సోరి ఎలైట్ విద్యార్థులు

**విశ్వంభర, రాప్తాడు:**





రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో ఉన్నటువంటి మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల నందు 7వ తరగతి చదువుతున్న పూజ్య, జశ్వంత్ అండర్ -14 కేటగిరి జిల్లా స్థాయిలో ఖోఖో పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పూ జ్య,జశ్వంత్,ను పాఠశాల యమ్.డి కృష్ణ భరత్ ,కరస్పాడెంట్ కృష్ణ సమీర , ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డిఅభినందించారు, కోచ్ అయినటు వంటి వీరన్న ని అభినందించడం జరిగింది.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**విశ్వంభర, గుండాల:**



మండలంలో ఉన్న రైతులందరు తమ పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోని సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్నీ పరిరక్షించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ యాకుబ్ అన్నారు,గుండాల మండలంలో రామారం గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీకాలు కార్యక్రమాన్ని ఆయనప్రారంభించారు,కార్యక్రమంలో భాగంగా సుమారు 159 పశువులకు టీకాలు వేయడం జరిగింది అని తెలిపారు కార్యక్రమంలో హెరిటేజ్ పాల సెంటర్ చైర్మన్ అందెం రాంరెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ రాజు గోపాలమిత్రలు వంగూరి గోవిందకిష్టయ్య,నరేష్,శ్రీనురైతులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

**విశ్వంభర, హైదరాబాద్:**
ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్ లోఎగిరేది కాంగ్రెస్ జెండానే అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో ఓటర్లు బీజేపీ, బీఆర్ఎస్ కు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను అప్యాయంగా పలుకరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ హైదరాబాద్ మహా నగరాభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. కొన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను చూపించి నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం మాపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశలు, భావితరాల ఆకాంక్షలే అజెండాగా అత్యంత పారదర్శకతతో కూడిన పాలనను తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి నిరంతరం పాటు పడుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి, నిరంతరం నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం తపించే నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, రంగారెడ్డి జిల్లా డీసీసీఅధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రామన్నపేట బిఆర్ఎస్ నాయకులు

**విశ్వంభర, రామన్నపేట:**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆదేశానుసారం బోరబండ డివిజన్లోని 314,315,316 పోలింగ్ బూత్ లలో ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు పాల్గొని మాగంటి సునీత గోపీనాథ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్-చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోతరాజు సాయి, తెలంగాణ ఉద్యమకారుడు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎస్కే చాంద్, కర్రె శ్రీను, కళ్లెం స్వామి, అమరేందర్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## టెలీసర్జన్ కన్సోల్ "ఎస్ఎస్ఐ మంత్రాసన్" ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :**
ఆధునిక సర్జికల్ రోబోటిక్ టెక్నాలజీ వికాసకుడు ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్, రోబోటిక్ సర్జరీని ప్రపంచం కోసం కిఫాయత్య, సులభతరంగా మార్చేందుకు పని చేస్తున్న సంస్థ, మరోసారి ఇన్నోవేషన్ పరిమితులను అధిగమిస్తూ ప్రపంచంలోనే మొదటి టెలీసర్జన్ కన్సోల్ ఎస్ఎస్ఐ మంత్రాసన్నుఅవిష్కరించింది. "మంత్రాసన్" అనేది ప్రపంచంలోనే మొదటి పూర్తిగా ఇంటిగ్రేటెడ్, ఆర్గోనోమిక్, పోర్టబుల్ టెలీసర్జరీ కన్సోల్, ఇది రిమోట్ ప్రెసిషన్తో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పును సూచిస్తుందనీ పేర్కొంది. ఒక ప్రత్యేక శస్త్రచికిత్స నిపుణుడి ఆఫీస్ నుంచి టెలీసర్జన్ కన్సోల్ జాగురైన కనిఫిగరేషన్ద్వారాసరళతగా విస్తరించవచ్చునీ పేర్కొం ది. అంతే కాకుండా టెలీసర్జరీ కోసం మొత్తం ఆపరేటింగ్ రూమ్ కన్సోల్తో అనుసంధించాల్సినఅవసరంఉండకపోవచ్చునీ వెల్లడించిం ది.రోబోటిక్ టెక్నాలజీ ఈ విజ్ఞానం సర్జికల్ కేర్ లో కీలకమైనదై నిలవబోతుంది, దీనివల్ల నిపు ణ శస్త్రచికిత్సకులు చిత్తశుద్ధితో, కాంపాక్ట్, సెల్ఫ్-కంటైన్డ్ రోబోటిక్ సిస్టమ్ ద్వారా దూరస్థంగా ఆపరేషన్ నిర్వహించగలరనీ పేర్కొంది.

## మదన్ కుమార్‌కు పీహెచ్డీ

**విశ్వంభర, సంగారెడ్డి:**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఆర్. మదన్ కుమార్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. సాగదీసిన షీట్ పై మాగ్నెటోహైడ్రోడైనమిక్ (ఎంహెచ్ డీ) నాన్-న్యూటోనియన్ నానోఫ్లూయిడ్ ప్రవాహంలో ఉష్ణ బదిలీ లక్షణంపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గ దర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శ్రీనివాసరాజు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ మదన్ కుమార్ అయస్కాంత, పోరస్ మీడియా ప్రభావాల కింద నానోఫ్లూయిడ్ డైనమిక్స్ యొక్క అధునాతన నమూనాలపై అధ్యయనం చేసినట్టు తెలియజేశారు. అదిక్రాస్-డిఫ్యూజన్ ప్రభావాలు, జిగట దుర్వినియోగం, క్రియాశీలత శక్తి, ఉష్ణ వికిరణం, రసాయన ప్రతిచర్యలను పరిశీలిస్తుందన్నారు. బలమైన సంఖ్యా పద్ధతులను ఉపయోగించి సాగదీసిన షీట్ లపై ద్రవం-ఉష్ణ పరస్పర చర్యలపై కొత్త అంతర్దృష్టులను పొందడానికి జెఫ్రీ, విలియమ్సన్ ద్రవ ప్రవాహ నమూనాలను ఉపయోగిస్తుందని తెలిపారు. ఈ పరిశోధనా ఫలితాలు బయోమెడికల్ ఇంజనీరింగ్, మైక్రోఫ్లూయిడిక్స్, నానోటెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్, ఆప్టికల్ పరికరాలు, స్మార్ట్ మెటీరియల్స్ లో ఉపయోగించగల అవకాశాలు కలిగి ఉన్నట్టు వివరించారు.ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించినట్టు పేర్కొన్నారు.

## ఘనంగా వందేమాతరం 150ఏళ్ల వేడుకలు

**విశ్వంభర, గుండాల:**



దేశభక్తి, సమైక్యతకు ప్రతీకగా ఉన్న వందేమాతరం పాడే 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, స్థానిక బస్టాండ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తేజం రెడ్డి, పోలీసు బృందము, ఇతరఅధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా, పాఠశాల విద్యార్థులు వరుసగా నిలబడి జాతీయగీతాన్ని ఆలపించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు, పోలీస్ అధికారులు పాల్గొని దేశభక్తిని ఉట్టి పడి చూపించారు. ముఖ్యంగా మహిళలూ, యువత రోడ్డుపై వరుసగా నిలబడి వందేమాతరంను ఆలపించడంతో పర్యావరణం దేశభక్తి గీతాలతో మార్మోగింది. ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ మేడం మాట్లాడుతూ"వందేమాతరం మనదేశ సమైక్యతకు ఆధారభూతం. ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలి" అని అన్నారు.పోలీస్ అధికారి తేజం రెడ్డి మాటాడుతూ, "వందేమాతరం 150వ సంవత్సరోత్సవాన్ని గుర్తుగా మన యువతలో దేశం కోసం సేవ చేయాలనే స్ఫూర్తిని కలిగించాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులూ, స్థానిక సంస్థల ప్రతినిధులూ పాల్గొన్నారు.

## డ్రైవర్లకు అవగాహన సదస్సు

**విశ్వంభర,నెల్లికుదురు/ఇనుగుర్తి:**



ఇటీవల జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా ఎస్పీ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు ఆధ్వర్యంలో నెల్లికుదురు,ఇనుగుర్తి మండలాల తో పాటు కేసముద్రం సర్కిల్ పరిధి డ్రైవర్లకు శుక్రవారం కేసముద్రం పోలీస్ స్టేషన్ లో అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రానైట్ క్వారీ, క్రషర్స్, అగ్రికల్చర్ మార్కెట్,గ్రీన్ ఫిల్డ్ లలో పనిచేస్తున్న లారీ,టిప్పర్,హెవీ వెహికిల్ డ్రైవర్స్ సదస్సులో పాల్గొన్నారు.సీఐ సత్యనారాయణ పలు సూచనలు చేశారు.ప్రతి డ్రైవర్ రోడ్డు పై వెళుతున్నపుడు సైనికుడు దేశం బోర్డర్ లో ఎంత జాగ్రత్తగా, బాధ్యతతో గస్తి కాస్తాడో అంతే బాధ్యతగా వాహనాలు నడపాలన్నారు. డ్రైవర్స్ రూరల్ ఏరియా లో వెహికల్ నడుపుతునపుడు చిన్న పిల్లలను చూసి వెహికల్ నడపాలని సీఐ సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్,మొబైల్ డ్రైవింగ్ చేస్తే వెహికల్ సిజ్ చేసి కోర్టు లో ప్రొడ్యూస్ చేస్తామని హెచ్చరించారు.డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వెహికల్ ఇన్సూరెన్స్ తప్పక కలిగివుండలని తెలిపారు. వెహికల్ కి ఇన్సూరెన్స్ లేకుండా,డ్రంక్ అండ్ డ్రైవ్ వాళ్ళ ఆక్సిడెంట్ చేసి మరణానికి కారణం ఐనటలైతే వారిపై 104 బి ఎన్ ఎస్ యాక్ట్ ప్రకారం 10 సం.లు శిక్ష గల సెక్షన్స్ కేసు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమం లో నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేష్ బాబు, ఇనుగుర్తి ఎస్ఐ గంగారపు కరుణాకర్, కేసముద్రం ఎస్సై లు క్రాంతి కిరణ్, నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా విశ్వంభర

# జూబ్లీహిల్స్ లో సబ్బండ వర్గాలు కాంగ్రెస్ వైపే

## ఈ 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉప ఎన్నికల్లో విజయం సాధించిపెడతాయి పార్టీ చేరికల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభచ, హైదరాబాద్:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి మరో 48 గంటల సమయం మాత్రమే ఉండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ యూసుఫ్ గూడా డివిజన్ లో సుడిగాలి పర్యటన చేశారు. డివిజన్ లో బూత్ ల వారిగా ఏర్పాటు చేసిన కార్యాలయాలకు బైక్ మీద తిరుగుతూ నేతలను సమన్వయ పరుస్తూ ప్రతి ఓటరు ను స్థానిక నేతలతో కలిసి స్వయంగా కలుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్థానికుడు,విద్యావంతుడు నవీన్ యాదవ్ కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వెంగల్ రావు నగర్ లో స్థానిక నాయకుడు సంజయ్ గౌడ్ ,ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బిఆర్ఎస్ బీజేపీ కి చెందిన కార్యకర్తలు , నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కండువా కప్పి మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీలోకి ఆహ్వానించారు.జూబ్లిహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్య మని,కాంగ్రెస్ పార్టీని నమ్మి పార్టీలో చేరి యువకు లకు , మహిళలకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతం పలికా రు.11వ తేదీజరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ లోకి ఎవరైనా రావచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు.ప్రజా పాలన ప్రభుత్వం లో అమలు చేస్తున్న పథకాలు సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కంటోన్మెంట్ఎన్నికల మాదిరి జూబ్లీహిల్స్లోనూ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలంటే ఈ మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నాయి బ్రాహ్మణ సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్కు నాయి బ్రాహ్మణ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి. నాయి బ్రాహ్మణ సోదరులకు ప్రభుత్వం ఇస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ %ఉత్తు% ఇళ్లలోకి వచ్చే 200 యూనిట్ల విద్యుత్ జీరో బిల్లు మాదిరి సెలూన్ లకు కూడా జీరో బిల్లు వచ్చేలా నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బకాయిలు ఉన్నాయని అధికారులు ఎక్కడ కనెక్షన్లు కట్ చేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు నాయి బ్రాహ్మణ సంఘానికి 10 గుంటల స్థలం , భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కుల వృత్తులు మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ మారుస్తూ కుల వృత్తులు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సెలూన్ మోడర్న్ గా మార్చడానికి ట్రైనింగ్ ఇన్స్టిట్ పెట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బలహీన వర్గాల బిడ్డ నవీన్ యాదవ్ గెలుపు కోసం అందరం ఐక్యంగా పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలునిచ్చారు.

## భారతీయులలో చైతన్యాన్ని రగిలించిన వందేమాతరం గీతం

**విశ్వంభర, గుండాల:**



వందేమాతర గేయం 150 సంవత్సరాల సంబరాల కార్యక్రమానికి ఎంపీ యుపిఎస్ బండ కొత్తపల్లిలో జరిగిన సామూహిక వందేమాతర గేయాలాపనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ వందేమాతర గేయం నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని అన్నారు. స్వతంత్రోద్యమంలో దేశ ప్రజలందరినీ ఏకతాడు మీదికి తేవడంలో వందేమాతర గీతం ప్రముఖ పాత్ర పోషించిందని తద్వారా దేశ ప్రజలందరిలో దేశభక్తిని నింపి ఐక్యతను చాటిందని తెలిపారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఎందరో వీరులు వందేమాతర గీతం తో సమాజాన్ని ఉత్తేజపరిచి తమ ప్రాణాలను అర్పించి స్వాతంత్రానికి ఆద్యం పోశారని తద్వారానే భారత స్వాతంత్ర ఉద్యమం ఎగసిపడి ఒక అలలాగా బ్రిటిష్ వారిని ఎదిరించగలిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ నరేందర్ రెడ్డి గారు వివోఏ సువర్ణ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉషశ్రీ శ్రీధర్ తిరుపతి మౌనిక ప్రియాంక అంగన్వాడి టీచర్లు విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.బి

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**విశ్వంభర, నాగారం:**



ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం లాంటిది అని సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగారం గ్రామస్తుడు జాజుల వీరయ్య అని అన్నారు. శుక్రవారంరాష్ట్ర రోడ్లు, భవనాల మరియు సిని మాటోగ్రాఫీ మంత్రి వర్యులు తెలంగాణ వెంకన్న అలియాస్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి సహకారం తో నాగారం మండల డి. కొత్తపల్లి గ్రామానికి చెందిన యలమ కంటి వెంకటేష్ ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 40000/ సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసి మాట్లాడుతూ నిరుపేదలు, అత్యవసర వైద్యం కొరకు ఇబ్బంది పడే వారికి అన్ని సమయాల్లో ఆపద కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అని అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సీనియర్ కాంగ్రెస్ నా యకులు దేవరకొండ మల్లయ్య , కన్నెబోయిన అంజయ్య ,కొండం వెంకటేశ్వర్లు , పడిశాల నగేష్ వెంకన్న ,దందోలు ప్రవీణ్ , దందోలు మహేష్ , పడిశాల రవి , హన్మంత్ పాల్గొన్నారు.

## “వందేమాతరం” సామూహిక గీతాలాపన

**విశ్వంభర, మహబూబాబాద్:**



మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ “వందే మాతరం” జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆ గీతాన్ని సామూహిక గానం చేయడం జరిగింది, కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్, గీతాన్ని ఆలపించారు,ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, హార్టికల్చర్ అధికారి మరియన్నా, బిసి, ఎస్సీ ,మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, డీఎంసివిల్ సప్లై కృష్ణవేణి, మైన్స్ ఏడి వెంకటరమణ, టీఎన్జీవోస్ జేఏసీ చైర్మన్ వడ్డబోయిన శ్రీనివాస్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, మెప్మా విజయ, విజయ కుమారి, మురళి,ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కొప్పు ప్రసాద్, సక్కుబాయి, కిషోర్, పాల్గొన్నారు.

# విజయవంతమైన న్యూరోవస్క్యులర్ శస్త్రచికిత్స



**విశ్వంభర, హనుమకొండ:**
మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వైద్య బృందం మరోసారి అత్యాధునిక న్యూరో సర్జరీలో గొప్ప విజయాన్ని సాధించింది. 52 ఏళ్ల మహిళా వరలక్ష్మికి ఎడమ ముందు మెదడు ధమని (%ూత్వతీఱశీతీ జవతీవఎత్షిశ్రీ ూతీవతీఎ%)లో ఏర్పడిన పగిలిన అన్యూరిజం కారణంగా వచ్చిన సబ్-???క్నాయిడ్ హీమరేజ్తో అత్యవసర పరిస్థితిలో 12 అక్టోబర్ 2025న ఆసుపత్రికి తీసుకువచ్చారు.రోగి పరిస్థితిని అత్యవసరంగా పరిశీలించిన న్యూరో సర్జరీ విభాగం, డా.టి. సంజయ్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ నేతృత్వంలో 13 అక్టోబర్ 2025న క్రానియోటమీతో అన్యూరిజం క్లిప్పింగ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది.ఈ శస్త్రచికిత్సలో డా. సంజయ్కు తోపాటు డా. యూనీస్, డా. కిషోర్, అనస్థీషియా నిపుణుడు డా. వాసు ప్రకాష్, క్రిటికల్ కేర్ ఇన్చార్జ్ డా. లక్ష్మీ దీపక్ పనిచేశారు. శస్త్ర చికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకుని, ఎటువంటి న్యూరోలాజికల్ లోపాలు లేకుండా సాధారణ ఆహారం తీసుకుంటూ పూర్తిస్థాయి కదలికలతో 25 అక్టోబర్ 2025న డిశ్చార్జ్ అయ్యారు.ఈ సందర్భంగా డా. టి. సంజయ్ మాట్లాడుతూ.ప్రపంచ జనాభాలో సుమారు 3.5% మందిలో మస్తిష్క అన్యూరిజంలు కనిపిస్తాయి. అందులో కేవలం 1% మాత్రమే Anterior Cerebral Arteryలో ఏర్పడుతాయి. ఇవి చాలా అరుదైన అత్యంత ప్రమాదకరమైన కేసులు. సమయానికి గుర్తించడం వెంటనే శస్త్రచికిత్స చేయడం ప్రాణాపాయ పునరావృత రక్తస్రావాన్ని నివారించడంలో కీలకము అని తెలిపారు.
మెడికవర్ హాస్పిటల్ వరంగల్ సెంటర్ హెడ్ శ్రీమతి నమ్రత మాట్లాడుతూ. ఇలాంటి అత్యంత క్లిష్ట న్యూరో సర్జరీ లను విజయవంతంగా నిర్వహించడం మా వైద్య బృందం నైపుణ్యానికి నిద ర్శనం. వరంగల్ పరిసర ప్రాంత ప్రజలకు ప్రపంచస్థాయి న్యూరోసర్జరీ క్రిటికల్కేర్ సేవలు అందించడానికి మేంకట్టుబడి ఉన్నాము అని తెలిపారు.

## వ్రందేమాతర గీతాలాపన

**విశ్వంభర, రామన్నపేట:**



కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా జాతీయ గేయమైన వందేమాతరం గీతాన్ని బంకిం చంద్ర చటర్జీ వ్రాసి 150 సం.రాలు పూర్తి అయిన సందర్భంగా బంకిం చంద్ర చటర్జీకి నివాళులు అర్పిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోజు ఉదయం 10:00 గంటలకు ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆద్వర్యంలో జాతీయ గేయమైన వందేమాతరం గీతాన్ని ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్ ఖానం, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారులు మిర్యాల అనిత, తాటిశెట్టి శ్రీనివాసులు, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ సునీత, డాక్టర్ వెంకట్ గౌడ్, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, డాక్టర్ రవీందర్ రావు, ఏఓ జి.కరుణాకర్, నరేష్, ఆంజనేయులు, రాధిక, రవి, నాగరాజు, ఫయాజ్, షరీఫ్, తదితర అధ్యాపక,విధ్యార్థులు పాల్గొన్నారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్ సంబరాలు ప్రారంభం

**విశ్వంభర,మహబూబాబాద్:**
జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల పాఠశాల, వర్సటైల్ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ శుక్రవారం జన విజ్ఞాన సమితి జిల్లా అధ్యక్షులు సాహితీ శ్రీనివాస్ అధ్యక్షతన వహించారు . ఈ సందర్భంగా హెచ్ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, సీనియర్ జిల్లా నాయకులు మంగపతి రావు మాట్లాడుతూ..విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న,ప్రతిభను వెలికి తీయడానికి ఈ సంబరాలు దోహదపడతాయని, ప్రశ్నాపత్రంలో ఉన్న ప్రశ్నలన్నీ కూడా బట్టీ పట్టే విధంగా కాకుండా, అప్లైడ్ సైన్స్ మెథడ్ లో ఉండడం వల్ల, విద్యార్థులలో సృజనాత్మకత శక్తి బయటపడుతుందన్నారు.విద్యార్థులు సైన్స్ పరంగా జ్ఞానాన్ని అర్జించే విధంగా కృషి చేయడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని, అందులో భాగమే చెకుముకి సంబరాలని, ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి పాలుపంచుకునేలా చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు . జిల్లా ప్రధాన కార్యదర్శి, చొప్పరి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 260 పాఠశాలలు, 20,000 మంది విద్యార్థులు, తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో హాజరయ్యారని, మొదటి స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులు ఒక జట్టుగా, ఈ నెల 21న జరిగే మండల స్థాయి పరీక్షలో పాల్గొంటారని,చెప్పారు .ఈ కార్యక్రమంలో ఖలీద్ పాషా,జిల్లా కోశాధికారి, ఇమ్మడి సునిత, ఉపాధ్యాయులు మాధవి, ఉమా , రహీమా , తదితరులు పాల్గొన్నారు .



## 100మందికి అన్నదానం

**విశ్వంభర,నార్కెట్ పల్లి:**



ఎల్ బి నగర్ వాస్తవ్యులు కామిశెట్టి ప్రవీణ్ అనిత కుమారుడు కామిశెట్టి శ్రీతన్ పుట్టిన రోజుసందర్భంగా నిరుపేదలకు నిస్సహాయులకు బాటసారులకు బిక్షాటన చేసేవారికి 100మందికి అన్నదానం చేయడం జరిగింది.కామిశెట్టి ప్రవీణ్ మాట్లాడుతూ నా కొడుకు కేక్ కట్ చేపియాకున్న పర్వాలేదు కానీ అన్నదానం మాత్రం తప్పకుండచేపియాలి అని పట్టుపడితే, నా కొడుకు మీద గౌరవం మరింత పెరిగింది. ఇంత చిన్న వయసులో ఇతరుల ఆకలి మీద ముందు చూపు ఆదర్శం.మనం ద్వారా ప్రతిరోజు నిరుపేలకూ2పూటలఅన్నం అందిచటంగొప్ప విషయం, నా కొడుకు పుట్టినరోజున ఇంతమంది ఆకలికీ మేలు చేయటం లక్షలు సంపాదించన ఈసంతోషం దొరకదు. మా ముఖ్యమైన రోజులను ఇంతమంది నిరుపేదల మధ్య జరపటం అలవాటు గా మారింది అని తెలియ్యజేశాడు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ అనిత శ్రీతన్ , కమిశెట్టి శ్రీనివాస్ స్వప్న,కొడుకులు రిత్విక్, పునీత్రప్రహస, నాను, పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్కు సంపూర్ణ మద్దతు

**విశ్వంభర, హైదరాబాద్:**
జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు బీసీ జన చైతన్య వేదిక సంపూర్ణ మద్దతు తెలుపుతుందాన్ని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూజూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసే యువ నాయకుడు నవీన్ యాదవ్ కు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకోవాలన్నారు. ప్రజా సేవకుడు అనునిత్యం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజల్లో ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అక్కున చేర్చుకొని నేనున్నాననీ ముందుకు వచ్చి ఆదుకుని ప్రజల హృదయాల్లో ప్రత్యేకమైన అభిమానాన్ని సంపాదించుకున్న నిజమైన ప్రజా సేవ యువ నాయకుడు నవీన్ యాదవ్ అన్నారు.నవీన్ యాదవ్ కు బీసీ జన చైతన్య వేదిక సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.జూబ్లీహిల్స్ లో ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు, ఆధిపత్య భావజాలానికి మధ్య జరుగుతున్న ఎన్నిక అన్నారు. 3.30 లక్షలపైన ఉన్న బీసీ, ఎస్సీ , ఎస్టీ ల సునామీ అన్నారు. తెలంగాణ బహుజన సమాజం రాజకీయంగా గెలవాలని,ఈ రాజకీయ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లు చాలా తెలివైన వాళ్ళు అని, తెలంగాణ రాష్ట్ర మొత్తం జూబ్లీహిల్స్ ఎన్నిక వైపు చూస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఓటర్ మహాశీయులకు తెలంగాణ చరిత్రలో నిలవాల్సిన మంచి చారిత్రక అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అంజి యాదవ్, ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతర గీతాలాపన...

**విశ్వంభర, రామన్నపేట:**



దేశ స్వాతంత్రోద్యమ సమయంలో మాతృ భూమిని కీర్తిస్తూ సాగే వందేమాతరం గేయాన్ని బంకించంద్ర చటర్జీ 1875 నవంబర్ 7 వ తేదీన అక్షయ నవమి నాడు రచించారు. ఈ గేయం భారతీయులను ఏకతాటి పైకి తీసుకు రావడమే లక్ష్యంగా అదే స్ఫూర్తిని రగిలిస్తున్న వందేమాతర0 గేయానికి నేటికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం రోజు ఉదయం 10:00 గంటలకు దేశ వ్యాప్తంగా అందరు ఒకే సమయంలో వందేమాతరం గేయం ఆలాపించాలని, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం గీతాలాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నపేట మాజీ ఎంపీపీ పూస బాలమణి-బాలనరసింహ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటగిరి శేఖర్, ఉపాయధ్యాయ బృందం విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలకు బారికేడ్లు మరిన్ని ఏర్పాటు చేయండి

**విశ్వంభర,కళ్యాణదుర్గం:**
అందరికి స్ఫూర్తి నిచ్చేలా తన సంగీతంతో ఆద్యంతం తన స్వారంతో కీర్తనలు పాడుతూ ప్రజల గుండెల్లో చరగని ముద్ర వేసుకున్న ఆధునిక కవి, శ్రీ కృష్ణుడి పరమ భక్తుడు భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను కళ్యాణదుర్గంలో నిర్వహిస్తుండటం, అక్కడే కనకదాసు 9అడుగుల కాంస్య విగ్రహావిష్కరణను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జరుగుతుందని అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వేలాదిగా కురుబలు, అన్ని సామాజిక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం అయ్యేలా చూస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎమ్ ఎస్ రాజు అన్నారు.. నేడు నారా లోకేష్ వేదిక చేరుకునే మార్గంతో పాటు సభావేదిక, విగ్రహం వద్ద చేసిన ఏర్పాట్లు, బారికేడింగ్ ఇతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జగదీష్ తో కలసి దేవినేని ధర్మతేజ, దేవినేని అవినాష్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్ ఎస్ రాజు పరిశీలించారు.



## 150 ఆకారంలో ఆదర్శ పాఠశాల విద్యార్థుల మానవహారం

**విశ్వంభర, త్రిపురారం**
త్రిపురారం మండలం లోని కంపసాగర్ లో గల మోడల్ స్కూల్ లో వందే మాతర%శీ% గీతం రాసి 150 సంవత్సరాలు ఆయన సందర్భంగా శుక్రవారం భోజనం ఉదయం 9.50 నిమిషాలకు విద్యార్థులు , ఉపాధ్యాయులు అందరూ కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం 150 ఆకారంలో మనవహారం గా విద్యార్థులు కూర్చున్నారు.ఈ సందర్భంగ పాఠశాల ప్రిన్సిపల్ మల్లికంటి వెంకటేశ్వర్లు వందేమాతరం గేయాని రాసిన బంకించంద్ర చటర్జీ గురించి మరి యు ఆ గేయం యొక్క ప్రాముఖ్యతను విద్యార్ధులకు వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యా ర్థులు,తదీతరులు పాల్గొన్నారు.



# ఢిల్లీ ఏటీసీలో వైఫల్యం.. సైబర్ దాడే కారణమా?

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు, మూడు రోజులుగా సాంకేతిక సమస్యతో వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సమస్యే దీనికి కారణంగా భావిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. సైబర్ దాడే దీనికి కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలోకి మాల్‌వేర్‌ను చొరబాటు వల్లే ఈ సమస్య తలెత్తిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ ఎయిర్ పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది.



**మాల్‌వేర్ చొరబాటు..?**
ఈ సాంకేతిక సమస్య కారణంగా విమానాల రాకపోకల అప్‌డేట్‌లను ఏటీసీ ఆటోమేటిక్‌గా పొందలేకపోతున్నట్లు తెలిదసింది. దీంతో ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలో వైఫల్యం చోటుచేసుకుందా? అన్న కోణంలో సంబంధిత విభాగాలు దర్యాప్తు మొదలుపెట్టాయి. మాల్‌వేర్ చొరబాటును సాఫ్ట్‌వేర్ సాయంతో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. సిస్టమ్‌లో కొన్ని కీలక అప్‌డేట్‌లు లేవని, ఎప్పటికప్పుడు బ్యాకప్ వ్యవస్థ కూడా కనిపించలేదని గుర్తించినట్లు సమాచారం. అయితే, ఇవన్నీ ప్రాథమిక అంచనాలేనని, పూర్తి కారణాలను విశ్లేషిస్తున్నట్లు సంబంధిత అధికారులు చెప్పినట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు, ఈ సైబర్ దాడి జరిగినట్లు వస్తున్న వాదనను ప్రభుత్వవర్గాలు తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

**300 విమానాలపై ఎఫెక్ట్..**
దిల్లీ ఐజీఐ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. ఇక్కడ నుంచి నిత్యం దాదాపు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. కొన్ని రోజులుగా ఇక్కడి విమాన ప్రయాణాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. విమాన నావిగేషన్ వ్యవస్థపై ప్రభావితం చూపే జీపీఎస్ స్పూఫింగ్ ఇందుకు కారణనే అను మానాలు వ్యక్తమయ్యాయి. ఊహించని విధంగా ఎయిర్ ట్రాఫిక్ పెరగడంతో అనేక విమానాలను దారి మళ్లించాల్సి వస్తోంది. శుక్రవారం ఒక్కరోజే 300లకుపైగా దేశీయ, అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడింది.

**ఏమిటీ జీపీఎస్ స్పూఫింగ్?**
నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ రూట్‌లలో ఇటీవల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ మన దేశంలోనూ ఇవి ప్రభావం చూపడం ఆందోళన కలిగించే విషయం.

## విజయ్.. గాల్లో మేడలు కడుతున్నారు: వైగో

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



టీవీకే అధినేత విజయ్‌పై ఎండీఎంకే చీఫ్ వైగో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ టీవీకే-డీఎంకే మధ్యే ఉండనుందని టీవీకే నేత చెప్పడంపై ఘాటుగా స్పందించారు. ఆయనకు రాజకీయాల్లో కనీసం ఓనమాలు కూడా తెలియవని, గాల్లో మేడలు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ పై విజయ్ విమర్శలు గుప్పించడంపై వైగో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు."ఆయన (విజయ్) ఇప్పటికే ముఖ్యమంత్రి అయినట్లుగా మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలుసుకోకుండా.. పేపరు పడవపై సముద్రాన్ని దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. గాల్లో మేడలు కట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన కలలన్నీ ఎండమావిలా మారతాయని ఇదివరకే చెప్పా" అని విజయ్ పేరు ప్రస్తావించకుండానే వైగో పరోక్ష విమర్శలు చేశారు.కరూర్ తొక్కిసలాట ఘటనలో బాధితులను విజయ్ మహాబలిపురంలోని ఓ రిసార్టుకు ఆహ్వానించడంపై వైగో మండిపడ్డారు. బాధిత కుటుంబాలను వారి నివాసాల్లోనే పరామర్శించకుండా రిసార్టుకు పిలిపించుకోవడం సిగ్గుచేటని అన్నారు. తమిళనాడు చరిత్రలో ఇటువంటి పరిణామం చూడలేదని, ఇదో కుట్ర అని ఆరోపించారు. గతంలో తూత్తుకుడిలో నిరసనల సందర్భంగా పోలీసుల కాల్పుల్లో 13 మంది చనిపోతే.. బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి తాను పరామర్శించానని గుర్తుచేశారు. ఇదిలాఉంటే, డీఎంకే ప్రభుత్వంలో వైగో నేతృత్వంలోని ఎండీఎంకే భాగస్వామ్యపక్షంగా ఉన్న సంగతి తెలిసిందే.

## వీధి కుక్కల కేసు.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



వీధి కుక్కల కేసులో శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది . విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే అవి ఈ ప్రదేశాల లోపలికివెళ్లకుండా కంచెలు వేయాలని సూచించింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని ఆదేశించింది. కుక్కల తరలింపునకు కోర్టు 8 వారాల సమయం ఇచ్చింది. జాతీయ రహదారులపై తిరుగుతున్న ఆలనాపాలనా లేని పశువులను షెల్టర్లకు తరలించాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

**అసలు ఏం జరిగిందంటే..?**
వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దానిని విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే.వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడినుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ..ఆగస్టు 11న ఇచ్చిన తీర్పు ను సవరించింది). అయితే ఇప్పుడు కుక్కలను మళ్లీ వెనక్కి తీసుకురాకుండా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. అలాగే వాటికి ఆహారం అందించేందుకు స్థానిక సంస్థలు ప్రత్యేకంగా ఫీడింగ్ స్పేస్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించింది. బహిరంగంగా ఆహారం అందించడానికి అను మతి లేదని, ఒకవేళ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పింది.

# అధికార పక్షానికే సానుకూలం భాగల్పూర్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
బిహార్‌కు ఆగ్నేయ దిక్కున ఉన్న భాగల్పూర్ ప్రాంతం దాదాపుగా అధికార పక్షానికే అండగా నిలుస్తూ వస్తోంది. గత 3 ఎన్నికల్లో ఈ ప్రాంతంలో అత్యధిక స్థానాలను గెలిచిన కూటమే అధికారం చేపట్టింది. ఈసారి ఈ ప్రాంతంలోని 12 సీట్లలో ఏ కూటమి ఆధిక్యం సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భాగల్పూర్ డివిజన్‌లో భాగల్పూర్, బంకా జిల్లాలున్నాయి. భాగల్పూర్‌లో 7, బంకాలో 5 నియోజకవర్గాలున్నాయి. అసెంబ్లీ సీట్ల పరంగా బిహార్‌లో ఇది అత్యంత చిన్న డివిజన్. ఈ ప్రాంతంలో కీలక నియోజకవర్గాల్లో భాగల్పూర్ ఒకటి. ఇక్కడి నుంచి సినీ నటి నేహా శర్మ తండ్రి అజిత్ కుమార్ శర్మ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. గత 3 సార్లు ఇక్కడి నుంచి ఆయనే గెలిచారు. సుల్తాన్ గంజ్, కహల్‌గావ్‌లలో మహాగట్‌బంధన్‌లోని కాంగ్రెస్, ఆర్జేడీ అభ్యర్థులు పరస్పరం తలపడు తున్నారు. వారు జేడీయూ అభ్యర్థులను ఢీకొంటున్నారు.




**అగ్ర, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రాబల్యం..**
భాగల్పూర్ ప్రాంతంలో అగ్ర వర్ణాలు, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. అంగ ప్రదేశ్‌లో భాగంగా ఉండే ఈ ప్రాంతం ఒకప్పుటి అంగ మహాజనపదలో భాగంగా ఉండేది. భాగల్పూర్ పట్టణ ప్రాంతాల్లోని, బంకా గ్రామీణ ప్రాంతాల్లోని అత్యంత వెనుకబడిన వర్గాల వారు (ఈబీసీలు) ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంటారు. వీరంతా సాధారణంగా నీతీశ్ వెంటే నడుస్తారు. గతంలో జరిగిన చాలా ఎన్నికల్లో ఆయనకే మద్దతుగా నిలిచారు. ఈసారి యువతలో కొంత మార్పు రావడంతో ఎటువైపు మొగ్గుతారో అనేది ఆసక్తికరంగా మారింది. ఉపాధి అవకాశాలపై వారు ఆగ్రహంగా ఉన్నారు. భాగల్పూర్‌లోని ముస్లిం-యాదవ్ సమీకరణంపై మహాగట్‌బంధన్ ఆశలు పెట్టుకుంది. ఈ జిల్లాల్లో వీరి సంఖ్య గణనీయంగానే ఉంది. ఝార?ండ్‌కు సరిహద్దులో ఉన్న బంకా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నక్సల్స్ ప్రభావం ఉంది. శాంతి భద్రతల అంశం ఇక్కడి ఎన్నికలను ప్రభావితం చేస్తుంది.చిరాగ్ పాస్వాన్‌కు ఈ ప్రాంతంలో బలం ఉన్న కారణంగా ఎన్డీయే లాభపడుతోంది.అగ్ర వర్ణాలు, ఈబీసీల ఓట్లతో ఆధిక్యం సాధిస్తామని ఎన్డీయే భావిస్తోంది. ముస్లిం-యాదవ్ సమీకరణంతోపాటు యువత ఓట్లతో మెజారిటీ దిశగా సాగుతామని ఆర్జేడీ అంచనా వేసుకుంటోంది.

**గతంలో..**
2010 ఎన్నికల్లో భాగల్పూర్ డివిజన్‌లోని 12 సీట్లలో ఎన్డీయే 10 సీట్లు గెలుచుకుంది. ఆర్జేడీ, కాంగ్రెస్ చెరోటి గెలుచుకున్నాయి.2015లో ఆర్జేడీ, జేడీయూ కలిసి పోటీ చేయగా.. ఆ కూటమికి 11 సీట్లు దక్కాయి. ఎన్డీయే కేవలం ఒక సీటే గెలుచుకుంది.2020లో మళ్లీ బీజేపీ, జేడీయూ కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీయే 9 సీట్లు గెలుచుకుంది. మహాగట్‌బంధన్ 3 సీట్లలో విజయం సాధించింది.

## ఢిల్లీ ఎఫెక్ట్.. ముంబయితో సహా దేశవ్యాప్తంగా విమానాలు ఆలస్యం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



సాంకేతిక సమస్య కారణంగా దిల్లీలో వందలాది విమానాల రాకపోకలపై ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ముంబయిలోనూ అదే పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ జారీ చేసింది. దిల్లీలో ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించింది. విమానాలు ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని ప్రయాణికులను అప్రమత్తం చేసింది. అప్‌డేట్ల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని సూచించింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది.ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే వెల్లడించింది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది. ఈ సమస్యకు సైబర్ దాడి ఏమైనా కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ముంబయితో పాటు జైపుర్, లఖ్‌నవూ, వారణాసి, ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోంది. ఎయిర్‌పోర్టులకు వచ్చే విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

## రహస్య అణు కార్యక్రమాలు పాకిస్థాన్‌కు అలవాటే!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని, ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లనెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
శబరిమల వెళ్లే భక్తులకు శుభవార్త. భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లుఏర్పాటు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు మొత్తం 60 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరిలోని పలు తేదీల్లో సర్వీసులందించనున్నాయి. ఈ రైళ్లు ఏయే తేదీల్లో రాకపోకలు సాగిస్తాయి? ఆ సమయాలు, ఏయే స్టేషన్లలో ఆగుతాయి? తదితర పూర్తి వివరాలివే..



చర్లపల్లి - కొల్లం-చర్లపల్లి (07107/07108) ప్రత్యేక రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మొత్తంగా 20 సర్వీసులు అందించనున్నాయి. 07107 రైలు నవంబర్ 17, 24, డిసెంబర్ 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19 తేదీల్లో (సోమవారం) చర్లపల్లిలో మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10గంటలకు కొల్లం చేరుకోనుంది. అలాగే, 07108 రైలు నవంబర్ 19, 26, డిసెంబర్ 3, 10, 17, 24, 31, జనవరి 7, 14, 21 తేదీల్లో (బుధవారం) తెల్లవారుజామున 2.30గంటలకు కొల్లంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు ఆగే స్టేషన్ల పేర్లను ఈ చార్ట్‌లలో చూడొచ్చు.

నర్సాపుర్ -కొల్లం - నర్సాపుర్ (07105/07106) రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా 20 సర్వీసులు అందించనున్నాయి. 0715 రైలు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 7, 14, 21, 28, జనవరి 4, 11, 18 తేదీల్లో (ఆదివారం) మధ్యాహ్నం 3గంటలకు నర్సాపూర్‌లో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10గంటలకు కొల్లం చేరుకుంటుంది. అలాగే, 07106 రైలు నవంబర్ 18, 25, డిసెంబర్ 2, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో తెల్లవారుజామున 2.30గంటలకు కొల్లంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.మచిలీపట్నం -కొల్లం- మచిలీపట్నం (07101/07102) రైలు గూడూరు, రేణిగుంట మీదుగా 10 సర్వీసులు అందిస్తాయి. 07101 రైలు నవంబర్ 14, 21, 28, డిసెంబర్ 26, జనవరి 2తేదీల్లో (శుక్రవారం) సాయంత్రం 4.30 గంటలకు మచిలీపట్నంలో బయల్దేరి ఆ మరుసటి రోజు రాత్రి 10గంటలకు కొల్లం చేరుకోనుంది. అలాగే, 07102 రైలు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 28, జనవరి 4 తేదీల్లో (ఆదివారం) కొల్లంలో తెల్లవారు జామున 2.30గంటలకు బయల్దేరి ఆ మరుసటి రోజు ఉదయం 8గంటల కు మచిలీపట్నం చేరుకుంటుంది.మచిలీపట్నం -కొల్లం- మచిలీపట్నం (07101/07102) రైలు గూడూరు, రేణిగుంట మీదుగా 10 సర్వీసులు అందిస్తాయి. 07101 రైలు నవంబర్ 14, 21, 28, డిసెంబర్ 26, జనవరి 2 తేదీల్లో (శుక్రవారం) సాయంత్రం 4.30గంటలకు మచిలీప ట్నంలో బయల్దేరి ఆ మరుసటి రోజు రాత్రి 10గంటలకు కొల్లం చేరుకో నుంది. అలాగే, 07102 రైలు నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 28, జనవరి 4 తేదీల్లో (ఆదివారం) కొల్లంలో తెల్లవారుజామున 2.30గంటలకు బయల్దేరి ఆ మరుసటి రోజు ఉదయం 8గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

# ఆ ప్రమాదం.. మీ కుమారుడి తప్పిదం కాదు

## ఎయిరిండియా దుర్ఘటనపై సుప్రీంకోర్టు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ క్రమంలో కేంద్రం, డీజీసీఏలకు నోటీసులు జారీ చేసింది. ఎయిరిండియా ప్రమాదంలో మృతి చెందిన 260 మందిలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధరించడంతోపాటు ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. ఈ ప్రమాదానికి పైలట్‌ల తప్పిదమే కారణమని దేశంలో ఎవరూ విశ్వసించడం లేదు. ఆయనపై అలాంటి ఆరోపణలు రాలేదు. ప్రమాదంపై జరిగిన ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణ మాత్రమే బయటకు వచ్చింది' అని పేర్కొంది. ఈ క్రమంలోనే పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)తో పాటు ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ నవంబరు 10కి వాయిదా వేసింది.



## ట్రంప్ భారత్ పర్యటన.. సమాచారం లేదన్న విదేశాంగశాఖ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్ లో పర్యటిస్తారనే సమాచారం ఏదీ తమవద్ద లేదని విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. అణు పరీక్షలకు సంబంధించి ట్రంప్ వ్యాఖ్యలపై రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయం భారత్‌కు పూర్తిగా తెలుసునని అన్నారు. రహస్య, చట్టవిరుద్ధమైన అణు కార్యకలాపాలు పాకిస్తాన్ చరిత్రలోనే ఓ భాగమని ఆయన విమర్శించారు. ఎప్పటికప్పుడు పాక్ అణు కార్యక్రమాల గురించి అంతర్జాతీయ సమాజానికి చెబుతూనే ఉన్నామన్నారు. అణుపరీక్షలపై రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్తాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను గమనిస్తూనే ఉన్నామన్నారు. ట్రంప్ భారత పర్యటన తాను ఏమీ స్పందించలేనని.. చెప్పేందుకు తన వద్ద సమాచారం ఏమీ లేదన్నారు. కాగా ఇటీవల ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్తాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని.. అమెరికా మాత్రమే పరీక్షలను నిలిపివేసిందన్నారు. ఇతర దేశాలు అణు పరీక్షలు చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు.

## ఢిల్లీ చేరుకున్న మయన్మార్ సైబర్ నేర బాధితులు



**ఢిల్లీ:** ఉద్యోగాల పేరిట మోసపోయి, మయన్మార్, థాయ్‌లాండ్ సరిహద్దులో సైబర్ నేర కేంద్రంలో చిక్కుకున్న పలువురు బాధితులు దిల్లీ చేరుకున్నారు. ఏపీకి చెందిన 11 మంది, తెలంగాణకు చెందిన మరో 11 మంది ఏపీ, తెలంగాణ భవన్‌లకు చేరుకున్నారు. అక్కడి అధికారులు రేపు మధ్యాహ్నం లోగా బాధితులను స్వస్థలాలకు చేర్చనున్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకున్న పలువురు భారతీయులను ప్రత్యేక వైమానిక దళ విమానంలో విదేశాంగశాఖ అధికారులు దిల్లీకి తీసుకొచ్చారు. ఐటీబీపీ కేంద్రంలో అన్ని రకాల పత్రాలను పరిశీలించి, సంబంధిత రాష్ట్రాల యంత్రాంగంతో సంప్రదించిన తర్వాత తెలుగు రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయి, నకిలీ ఉద్యోగాల మోజులో పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## శ్రీచరణికి ఏపీ ప్రభుత్వం నజరానా.. రూ.2.5 కోట్ల నగదు పురస్కారం

**విశ్వంభర, విజయవాడ:**



వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం, మహిళా క్రికెటర్ శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది.

**ఇది మొదటి అడుగు మాత్రమే: శ్రీచరణి**

క్రికెటర్ శ్రీచరణి ఇవాళ ఉదయం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబం నుంచి నాకు చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడించేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే.. ముందు చాలా ఉంది. ప్రధాని మోదీని కలిసినప్పుడు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారు" అని అన్నారు.

## రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, గుంటూరు:**



రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాల్లో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "రైతును ఆదుకునేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మొన్నటి తుపానులో నష్టపోయిన రైతులను ఆదుకున్నాం. మేం వచ్చాక పంటల బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచాం. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తున్నాం. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశాం. కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. తరచుగా వచ్చే తుపాన్ల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారు" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

## తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చిరుత సంచారం

**విశ్వంభర, తిరుపతి:**



తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో చిరుత సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేసింది. ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్, ఐ-బ్లాక్ ప్రాంతంలో చిరుత సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. భవన నిర్మాణ ప్రాంతంలో కుక్కపై చిరుత దాడి చేసిన దృశ్యాలు చూసిన వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది భయాందోళనలో ఉన్నారు. విద్యార్థులు ఒంటరిగా బయటకు రావొద్దని వర్సిటీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## కల్తీ మద్యం కేసులో నిందితుల ఆస్తులు జప్తు చేయాలి:

**విశ్వంభర, తిరువూరు:**



కల్తీ మద్యం కేసులో నిందితులను జైలుకు పంపించడంతో పాటు,వారి ఆస్తులు జప్తు చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తిరువూరులో ప్రజా దర్బార్ నిర్వహించిన అనంతరం కొలికపూడి మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా కల్తీ మద్యంపై అరెస్టులు పర్వం కొనసాగుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలోనే జోగి రమేశ్ కల్తీ మద్యం దందా నిర్వహించే వాడని, అతని బినామీలు అందరూ కటకటాల్లోకి వెళ్తున్నారన్నారు. అలాంటి వారి ఆస్తులను వెంటనే జప్తు చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్టు చెప్పారు.

# ఏపీలో రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం

**విశ్వంభర, అమరావతి:**

ఏపీలో రూ.1,01,899 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడులు ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా 85,870 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం 12వ ఎస్ఐపీబీ సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్లస్టర్ వారీగా పారిశ్రామికాభివృద్ధి చేపడతామని తెలిపారు. మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్లను అభివృద్ధి చేస్తామన్నారు. పెట్టుబడుల సదస్సు కంటే ముందే వివిధ పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తామన్నారు.

**ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన పెట్టుబడులు..**

- రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్స్ లిమిటెడ్ - రూ.202 కోట్లు - 436 మందికి ఉద్యోగాలు
- ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.700 కోట్లు - 1,000 మందికి ఉద్యోగాలు
- ఎన్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,081 కోట్లు - 600 మందికి ఉద్యోగాలు
- క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్ - రూ.1,154 కోట్లు - 1500 మందికి ఉద్యోగాలు
- ఎస్‌సీఐసీ వెంచర్స్ ఎల్ఎల్పీ - రూ.550 కోట్లు - 1130 మందికి ఉద్యోగాలు
- ఇండిచిప్ సెమీ కండక్టర్స్ లిమిటెడ్ - రూ.22,976 కోట్లు - 1241 మందికి ఉద్యోగాలు
- ఫ్లూయింట్‌గ్రిడ్ లిమిటెడ్ - రూ.150 కోట్లు - 2,000 మందికి ఉద్యోగాలు
- మథర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ - రూ.110 కోట్లు - 700 మందికి ఉద్యోగాలు
- క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.115 కోట్లు - 2000 మందికి ఉద్యోగాలు
- రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.2,172 కోట్లు - 9,681 మందికి ఉద్యోగాలు
- విశాఖ రియాల్టీ ప్రైవేట్‌లిమిటెడ్ - రూ.2,200 కోట్లు - 30 వేల మందికి ఉద్యోగాలు
- ఐస్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.119 కోట్లు - 2,000 మందికి ఉద్యోగాలు
- సీల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1728 కోట్లు - 860 మందికి ఉద్యోగాలు
- నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ - రూ.7,972కోట్లు -2,700 మందికి ఉద్యోగాలు
- మైరా బే వ్యూ రిసార్ట్స్ - రూ.157 కోట్లు - 980 మందికి ఉద్యోగాలు
- విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.51కోట్లు - 750మందికి ఉద్యోగాలు
- సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ.1247 కోట్లు - 1,100 మందికి ఉద్యోగాలు
- సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ - రూ.8570 కోట్లు - 1000 మందికి ఉద్యోగాలు
- వాల్టన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1682 కోట్లు - 415 మందికి ఉద్యోగాలు



- ఏఎమ్‌జీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ లిమిటెడ్ - రూ.44,000 కోట్లు - 3000 మందికి ఉద్యోగాలు
- వాసంగ్ ఎంటర్ ప్రైజెస్ - రూ.898 కోట్లు - 17,645 మందికి ఉద్యోగాలు
- బిర్లా లిమిటెడ్ - రూ.240 కోట్లు - 588 మందికి ఉద్యోగాలు
- సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - రూ.1,090 కోట్లు - 1250 మందికి ఉద్యోగాలు
- భారత్ డైనమిక్స్ - రూ.489 కోట్లు - 500 మందికి ఉద్యోగాలు
- డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్ - రూ.1234 కోట్లు - 1454 మందికి ఉద్యోగాలు

శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ.12 కోట్లు - 1500 మందికి ఉద్యోగాలు

మరోవైపు ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏపీలో రూ.5,942 కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా నాయుడుపేటలో సౌర యూనిట్‌ను ప్రారంభించబోతున్నట్లు మంత్రి నారాలోకేశ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 3,500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టు కోసం ఏపీఐఐసీ ద్వారా 269 ఎకరాలు కేటాయించామన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సోలార్‌సెల్ ప్రాజెక్టు ఏపీకి రానున్నట్లు చెప్పారు.

# పల్లె పండగ 2.0పై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

**విశ్వంభర, అమరావతి:**



గ్రామాల్లో నివశించే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరుతో పాటు, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పల్లె రోడ్ల సమాచారం అందరికీ తెలిసేలా జియో రూరల్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాంకేతికత అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సాస్కీ నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్ర పథకాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పవన్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ రహదారులన్నింటినీ జియో రూరల్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అనుసంధానించడం ద్వారా మనం ప్రయాణం చేసే మార్గంలో రోడ్డు ఎలా ఉందనే వివరాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. అడవితల్లి బాటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని, స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.కేంద్రం నుంచి పీఎం జన్‌మన్‌తో పాటు ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సాయం మొత్తం కలిపి రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలోని 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలని, ఏదైనా సమస్య ఉంటే తక్షణం పరిష్కరించాలన్నారు. పల్లెల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పనులు ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలన్నారు. నవంబర్ మూడో వారం నుంచి జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని పవన్ తెలిపారు.

## 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు' పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

పద్మ విభూషణ్ ఆచార్య ఎన్.జి.రంగా 125వ జయంతిని పురస్కరించుకుని గుంటూరు వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన జయంతి వేడుకలకు సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ ఎన్.జి.రంగా జీవిత ఘట్టాలను వివరించే ఫొటో ఎగ్జిబిషన్ ను ఆయనతిలకించారు. అనంతరం ఎన్.జి. రంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు' పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాను కారణంగా నష్టపోయామని రాష్ట్రంలో ఏ ఒక్కరైతు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతుల్ని ఇప్పటికే ఆదుకున్నామన్న ఆయన.. తమ ప్రభుత్వం వచ్చాక రైతులకు పంటల బీమా చెల్లించి అండగా నిలిచామన్నారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లను పూర్తి చేశామని, కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

# డిసెంబర్ 30 నుంచి తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం: టీటీడీ ఈవో

**విశ్వంభర, తిరుమల:**



తిరుమల శ్రీవారి భక్తుల విజ్ఞప్తి మేరకు అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీని డిప్ విధానం నుంచి మార్చినట్లు ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ కోటా విడుదల చేయనున్నట్లు చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్లు జారీ చేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు తితిదే బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.."తిరుమలలో డిసెంబర్ 30 నుంచి 2026 జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. ఇందు కోసం ఆఫ్‌లైన్, ఆన్ లైన్ టోకెన్ల జారీ విధి విధానాలు త్వరలో తెలియజేస్తాం. రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాల్లో రూ.750 కోట్ల శ్రీవాణి ట్రస్టు నిధులతో 5 వేల భజన మందిరాలు నిర్మిస్తాం. తిరుమల అటవీ ప్రాంతంలో రానున్న 10 సంవత్సరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు తితిదే బోర్డు నిర్ణయించింది. తితిదే ఆలయాల్లోని ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లుగా అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రాకారము, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి పనులు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి" అని అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు.

## బనకచర్లపై వెనక్కి తగ్గిన ఏపీ... టెండర్లు రద్దు

**విశ్వంభర, పోలవరం:**

బనకచర్లపై ఏపీ వెనక్కి తగ్గినట్టు కనిపిస్తోంది. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ కోసం చేపట్టిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఏపీ ప్రకటించింది. హైదరాబాద్ లో జరిగిన పోలవరం అథారిటీ సమావేశంలో ఈ అంశాన్ని వెల్లడించింది. అంతర్రాష్ట్ర నదీజలాల ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీ ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలంగాణ తొలినుంచి వ్యతిరేకిస్తూ వచ్చింది. దీనిపై కేంద్రానికి, %జఔజ%కి ఫిర్యాదు చేసింది. న్యాయపోరాటానికీ సిద్ధమైంది. అయితే అక్టోబర్ 8న టెండర్లు ఆహ్వానించిన ఏపి ప్రభుత్వం.. అక్టోబర్ 22 వరకు టెండర్లకు గడువుగా నిర్ణయించింది. అదే రోజు నుంచి సంస్థలకు టెండర్? డాక్యుమెంట్ అందుబాటులో ఉంచింది.

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరందిస్తాం: మంత్రి నిమ్మల

**విశ్వంభర, అమరావతి:**



పూర్తి కాని వెలిగొండ ప్రాజెక్టును.. జగన్ జాతికి అంకితం అంటూ ప్రకాశం జిల్లా ప్రజల్ని మోసం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. జంట సొరంగాల్లోకి చొచ్చుకువచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణం డిజైన్స్ అప్రూవల్ చేయాలన్నారు. ప్రాజెక్టు పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు."పూర్తి కాని వెలిగొండను పూర్తి చేశానని జగన్ అనడం ప్రపంచంలో ఎనిమిదో వింత. నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా ఒక్క రూపాయి పంపిణీ చేయలేదు. ఆగిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు పునరుద్ధరించారు. టన్నెల్-2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టీబీఎం యంత్రం తొలగించాల్సి ఉంది. ఫీడర్ కెనాల్ లైనింగ్, 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లతో టెండర్లు పిలిచాం. ఈ నెలలోనే ఫీడర్ కెనాల్ పనులు మొదలుపెట్టబోతున్నాం. టన్నెల్-2లో టీబీఎం యంత్రం తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో పని చేస్తున్నాం" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

## వేమూరి ట్రావెల్స్ బస్సు యజమాని అరెస్టు

**విశ్వంభర, కర్నూలు:**



వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్‌ను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయన్ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు.. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి వీరంతా సజీవ దహనమయ్యారు. ఈ బస్సు రిజిస్ట్రేషన్ విషయంలోనూ లొసుగులున్నట్లు.. సీటర్ వాహనాన్ని స్లీపర్‌గా మార్చినట్లు ఆరోపణలున్నాయి. ప్రమాద ఘటనకు సంబంధించి బస్సు డ్రైవర్, యజమానిపై కేసు నమోదైంది. ఇప్పటికే ఏ-1 అయిన డ్రైవర్ లక్ష్మయ్యను పోలీసులు అరెస్టు చేశారు.

**రూ.10వేల పూచీకత్తుపై విడుదల..**

వి. కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్‌కుమార్ విడుదలయ్యారు. కర్నూలు బస్సు ప్రమాదఘటనలో ఏ2గా ఉన్న ఆయన్ని అరెస్టు చేసిన పోలీసులు.. కర్నూలు స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం రూ.10 వేల సొంత పూచీకత్తుపై ఆయన్ని విడుదల చేసింది. ఈ మేరకు మెజిస్ట్రేట్ అనూష ఆదేశాలిచ్చారు.

# పంచభూతాత్మ స్వరూపుడు పరమేశ్వరుడు

లింగోద్భవ పుణ్యకాలంలో శివస్మరణ, ముక్తిదాయకమంటారు. నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశాలన్నిటా వ్యాపించి ఉన్న పంచభూతాత్మ స్వరూపుడు, సాకారుడు, నిరాధరుడు అయిన లయకారుడు ఆ మహాశివుడు.పరమేశ్వరుడు లింగరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. భారతదేశంలో ఎన్నో మహిమాన్వితమైన స్వయంభు శివలింగ క్షేత్రాలు ఉన్నాయి. వీటిలో సమస్త జీవకోటికి ఆధారమైన గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశాలను ప్రతిబింబించే అద్భుతమైన శివలింగ క్షేత్రాలు కూడా ఉండడం విశేషం. ఆ లింగరూపాన్ని దర్శించుకునే వారికి సకలసంపదలు చేకూరుతాయని పండితులు అంటున్నారు. అందులో కీలకమైన పంచలింగాలు. పృథ్విలింగం, ఆకాశలింగం, జలలింగం, తేజోలింగం, వాయులింగములను పంచభూతలింగాలు అంటారు. ఈ పంచభూతాత్ముని పంచభూతలింగాలు నెలకొన్న పుణ్యక్షేత్రాలు కాంచీపురం, జంబుకేశ్వరం, అరుణాచలం, శ్రీకాళహస్తి, చిదంబరం. ఈ క్షేత్రాలు దక్షిణాది రాష్ట్రాల్లో మనకు దగ్గరలోనే ఉన్నాయి. పంచ లింగాలు ప్రాముఖ్యత ఈ పంచ భూత శివలింగ క్షేత్రాలు ఒకటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే ఉంటే నాలుగు తమిళనాడు రాష్ట్రంలో ఉన్నాయి. మహాశివరాత్రి వంటి ముఖ్యమైన రోజుతో పాటు ఇతర పవిత్ర పుణ్యదినాల్లో ఈ క్షేత్రాలను దర్శించేందుకు భక్తులు ఎంతో ఆసక్తి చూపిస్తారు. ఈ క్షేత్రాలను దర్శించాలనే ఆసక్తి ఉన్న భక్తుల కోసం విశ్వంభర దినపత్రిక ప్రత్యేక కథనం..

## పంచ భూత స్థలములు పంచలింగ క్షేత్రాలు..

-పోతుగంటి వెంకటరమణ, బ్యూరో చీఫ్

## తేజో లింగం (తిరువణ్ణామల్లై, తమిళనాడు)

ఇక అగ్నికి ప్రతీకగా తేజోరూపాన హరుడు వెలసిన క్షేత్రం అరుణాచలం. బ్రహ్మ, విష్ణువులు 'ఎవరుగొప్ప' అని వాదించుకుంటుండగా ఆ సంవాదాన్ని నివారించేందుకు శివుడు తేజోలింగ రూపంగా వెలసింది ఇక్కడేనట. అలా వెలసినందుకే ఈ అరుణాచలం చుట్టూ ప్రదిక్షణలు చేస్తే సాక్షాత్తూ ఆ స్వామి ప్రదక్షిణ చేసినట్టే అంటారు. తమిళనాడులోని అరుణాచల శిఖరాగ్రంపై అగ్నిశిఖ ఒకటి ఆవిర్భవించి తేజోలింగ రూపమయ్యాడు శివుడు. ఈయన పేరే అరుణాచలేశ్వరుడు. అమ్మవారి పేరు అరుణాచలేశ్వరి. అమ్మవారి పేరు అపీతకుచమాంబ. పంచభూతాలలో అగ్ని తత్వానికి ప్రతీక ఈ తేజో లింగం. తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం కొండపై తిరువణ్ణామలై పవిత్ర క్షేత్రం ఉంది. ఈ కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే సాక్షాత్తు శివుని చుట్టూ ప్రదక్షిణ చేసిన ఫలితం ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. అరుణాచల క్షేత్రానికి ఎంతో పురాణ ప్రాశస్త్యం కూడా ఉంది. తమిళనాడు రాష్ట్రంలో తప్పక సందర్శించాల్సిన తీర్థయాత్ర స్థలాల్లో అరుణాచలం ముఖ్యమైనది. భగవాన్ రమణ మహర్షి తన శేష జీవితాన్ని ఈ క్షేత్రంలోనే గడిపి ఎన్నో మహిమలు చూపించారు. చెన్నై నుంచి ఇక్కడికి 185 కిలోమీటర్ల దూరం.అరుణాచలం ఆలయం ప్రాంగణంలోని మూడోప్రాకారంలో పంచభూత లింగాల్లో మిగితావైన ఏకాంబరేశ్వర, జంబుకేశ్వర, శ్రీకాళహస్తీశ్వర, చిదంబర లింగాల ఆలయాల నమూనాలను దర్శించవచ్చు. అందుకే అన్ని చోట్లకూ వెళ్ళలేకపోతే ఒక్క అరుణాచలాన్ని దర్శిస్తే పంచభూత ఆలయాలని ఒకచోట దర్శించవచ్చు. అరుణాచలం గురించి ఆలోచిస్తే చాలు మోక్షం లభిస్తుందట. ఈక్షేత్రంపై రెండు కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకప్పుడు పార్వతీ దేవి సరదాగా శివుని కన్నులు మూసింది. ఇది వేల సంవత్సరాల పాటు విశ్వంలో చీకటికి దారితీసింది. తన భక్తులచే తపస్సు చేసిన తరువాత, శివుడు తిరువణ్ణామలైలోని అన్నామలై కొండపై అగ్ని స్తంభంగా కనిపించాడు.శివుని యొక్క అగ్ని మూలకాన్ని వివరించే మరొక కథ ఉంది. విష్ణువు మరియు బ్రహ్మ దేవుడు ఆధిపత్యం కోసం పోటీ పడినప్పుడు, శివుడు ఒక జ్వాలగా కనిపించి తన మూలాన్ని కనుగొనమని వారిని సవాలు చేశాడు. బ్రహ్మ హంస రూపాన్ని ధరించి జ్వాల యొక్క పైభాగాన్ని చూడడానికి ఆకాశం వైపు ఎగిరింది, విష్ణువు వరాహంగా మారి క్రిందికి వెళ్ళాడు. హిందూ పురాణాలలో ఈ దృశ్యాన్ని లింగోత్భవ అంటారు . బ్రహ్మ, విష్ణువు మూలాన్ని కనుగొనడంలో విఫలమయ్యారు. విష్ణువు తన ఓటమిని అంగీకరించగా, బ్రహ్మ తనకు శిఖరం దొరికిందని అబద్ధం చెప్పాడు. శిక్షలో, శివుడు తన పూజలో బ్రహ్మకు భూమిపై దేవాలయాలు ఉండకూడదని ఆదేశించాడు.కథ యొక్క సారాంశం ఏంటంటే..అగ్ని స్వచ్ఛతను సూచిస్తుంది, అగ్ని కాంతిని సూచిస్తుంది మరియు అగ్ని శక్తిని సూచిస్తుంది. మరియు దైవాన్ని ఆరాధించడం, జపించడం మరియు స్మరించుకోవడం మన జీవితాలలో, మన మనస్సులలో మరియు మన హృదయాలలో స్వచ్ఛతను తెస్తుంది.

అరుణాచలేశ్వర్ దేవత సాధకులకు జ్ఞానం యొక్క కాంతి, కర్మ ముద్రల ప్రక్షాళన మరియు సానుకూల శక్తిని అనుగ్రహిస్తుంది.

అరుణాచలేశ్వర ఆలయం గురించి 5 వాస్తవాలు

శివుని ఆరాధనకు అంకితం చేయబడిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆలయం.ఈ ఆలయం భారతదేశంలో ఎనిమిదో అతిపెద్ద దేవాలయంగా చెప్పబడింది; ఇది తన 24 ఎకరాల ప్రాంతాన్ని పూర్తిగా మతపరమైన ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుంది.ఈ ఆలయ చరిత్ర వేల సంవత్సరాల నాటిది మరియు ఇది పవిత్రమైన తమిళ గ్రంథాలలో కూడా ప్రస్తావించబడింది.ప్రతి పౌర్ణమికి వేలాది మంది యాత్రికులు అరుణాచల కొండకు ప్రదక్షిణలు చేసి పూజలు చేస్తారు. ఇది 14 కిలోమీటర్ల పొడవైన నడక. ఈ నడక పాపాలను పోగొడుతుంది, కోరికలను తీర్చుతుంది మరియు జనన మరణ చక్రం నుండి విముక్తిని ఇస్తుంది అని పురాణం.ఈ ఆలయంలో నాలుగు గోపురాలు, ఒక్కొక్క వైపు ఉన్నాయి. వీటిలో ఎత్తైన రాజగోపురం అని పిలుస్తారు, ఇది 217 అడుగుల ఎత్తు మరియు భారతదేశంలో మూడవ అతిపెద్దది.



## ఆకాశలింగం (చిదంబరం, తమిళనాడు)

ఇక ఆఖరి పంచభూత లింగక్షేత్రం చిదంబరం. ఆకాశ రూపాన్ని భోళాశంకరుడు కొలువై ఉన్న క్షేత్రం . ఇది తమిళనాడులో ఉంది. చెన్నై నుంచి చిదంబరంకు 229 కిలోమీటర్ల దూరం.ఆకాశలింగ దర్శనం రహస్యమైనది. ఆకాశమంటే అనంత శూన్యం కదా. అందుకే ఇక్కడి గర్భగుడిలో లింగరూపం కనిపించదు. ఆ ప్రదేశం ఖాళీగా ఉంటుంది. రోజూ అర్చకులు పూజచేసి కొద్దిసేపు ఆ తెరను తీస్తారు. కానీ అక్కడ ఏమీ ఉండదు. అందువల్లనే చిదంబర రహస్యం అనే పేరు వచ్చినది. ఇక్కడ గర్భగుడిలో స్వామి మూడు రూపాలలో ఉంటారు. సంపూర్ణ మానవరూపంతో ఉండే నృత్య భంగిమలో ఉన్న నటరాజస్వామి. స్ఫటిక రూపంలో ఉంటే చంద్రమౌళీశ్వర స్వామి. ఇక మూడోది నిరాకారం. ఈ మూడవ రూపాన్నే ఆకాశ తత్వానికి ప్రతీకగా భావిస్తారు. ఈ క్షేత్రంలో నటరాజస్వామి, శివకామ సుందరి అమ్మవార్లు మాత్రమే ఉంటారు.చిదంబరం పట్టణంలో తిల్లై నటరాజ ఆలయ గోపురం. భారతదేశంలోని అతిపెద్ద ఆలయ గోపురాల్లో ఇది కూడా ఒకటి. శివుడు ఒకప్పుడు చిదంబరంలో ఉన్న మడ అడవులలో (తిల్లై వనం) విహరిస్తున్నాడు. మంత్రాలను నమ్మే ఋషులు మరియు ఆచారాలు, మంత్రాల ద్వారా భగవంతుడిని నియంత్రించగలరని అడవిలో ఉంచారు. ఋషులు, వారి భార్యలు శివుని అందానికి మంత్రముగ్ధులయ్యారు. వారి స్త్రీలను మంత్రముగ్ధులను చేయడం చూసి, ఋషులు కోపోద్రిక్తులైనారు, అనేక సర్పాలను పిలిచారు. పరమశివుడు పాములను ఎత్తుకొని తన తాళాలు, మెడ, నడుముపై ఆభరణాలుగా ధరించాడు.మరింత కోపంతో, ఋషులు ఒక భయంకరమైన పులిని పిలిచారు, దాని చర్మాన్ని శివుడు తన నడుము చుట్టూ శాలువగా ఉపయోగించాడు. అప్పుడు ఒక భయంకరమైన ఏనుగును అనుసరించాడు, దానిని శివుడు మ్రింగివేసి చంపాడు. మనందరిలోని అహంకారానికి, అజ్ఞానానికి ప్రతీకగా నిలిచే ముయలకన్ని ఋషులు చివరకు ఆవాహన చేశారు. శివుడు రాక్షసుడిని తన పాదాల క్రింద నలిపివేసి, ఆనంద తాండవాన్ని (శాశ్వతమైన ఆనంద నృత్యం) ప్రదర్శించాడు. అతని నిజ రూపాన్ని వెల్లడించాడు. చిదంబరంలోని నటరాజ విగ్రహం ఆనంద తాండవం చేస్తున్న దేవతను వర్ణిస్తుంది.




**తిల్లై నటరాజ దేవాలయం గురించిన 5 వాస్తవాలు..**

చిదంబరం పట్టణం నడిబొడ్డున 40 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ ఆలయం భారతదేశంలోని ఐదవ అతిపెద్ద దేవాలయం."చిదంబరం" అనే పదం "చిత్" అనే పదం నుండి ఉద్భవించింది, దీని అర్థం స్పృహ మరియు "అంబరం", అంటే ఆకాశం. పంచ భూత స్థలంలో శివుడు లింగం కాకుండా మానవరూప విగ్రహంతో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక ఆలయం ఇది. ఆలయం స్ఫటికంతో చేసిన లింగం రూపంలో మరియు అతని నిరాకార రూపంలో శివుడిని కూడా పూజిస్తుంది.ఆలయ గోపురం చోళ రాజు పరాంతకుడు బంగారు పూతతో కప్పబడి ఉంది.పురాణాల ప్రకారం ఈ ఆలయం విశ్వంలోని కమలాల గుండె వద్ద ఉంది - విరాట్ హృదయ పద్మ స్థలం.

## పృథ్వీలింగం కంచి, తమిళనాడు

పంచ భూతాలలో భూమికి ప్రతీకగా ఆ మహాదేవుడు పృథ్వీ లింగ రూపాన ఏకాంబరేశ్వరుడిగా పూజలందుకునే పుణ్యక్షేత్రం కాంచీపురం. ఇది తమిళనాడులో ఉంది. పార్వతీదేవి ఇక్కడ శివుని గురించి ఘోర తపస్సు చేసిందనీ, ఇసుకతో శివలింగం తయారు చేసి అందులో ఐక్యం అయ్యిందనీ స్థలపురాణం చెబుతోంది. పార్వతీదేవిచే ఈ లింగం ప్రతిష్టించబడినది. మట్టితో తయారయింది కాబట్టి ఈ లింగాన్ని నీటితో అభిషేకించరు. మల్లెపూలతో అర్చిస్తారు. ఇక్కడి అమ్మవారు కామాక్షీదేవి.అష్టాదశ పీఠాలలో ఇది ఒకటి.భారతదేశంలో అతిపెద్ద గోపురాలు గల ఆలయాల్లో కంచిలో ఉన్న ఏకాంబరేశ్వర ఆలయం ఒకటి. ఈ ఆలయంలో ఉన్న శివలింగం భూమికి చిహ్నం. ఇక్కడ దాదాపు 1008 శివలింగాలను ప్రతిష్టించినట్లు చెబుతారు. వెయ్యి స్తంభాల నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఏకాంబరేశ్వర ఆలయంలో 3,500 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక మామిడి చెట్టు ఉంది. దానికున్న నాలుగు శాఖలూ నాలుగు రకాల పళ్లను కాస్తాయంటారు. ఆ శాఖలూ నాలుగు వేదాలకు ప్రతిరూపాలని భక్తుల నమ్మకం.ఈ చెట్టు ఫలాలు సంతానం లేని వారికి సంతానం కలిగిస్తాయని నమ్మకం. చెన్నై నుంచి 72 కిలోమీటర్ల దూరంలో ఏకాంబరేశ్వర ఆలయం ఉంది.ఈ ఆలయ మూలం గురించి ఒక పురాణం ఉంది.ఒకప్పుడు పార్వతీ దేవి మామిడి చెట్టు క్రింద తపస్సు చేస్తుంది. ఆమె భక్తిని పరీక్షించడానికి, ఆమె తపస్సుకు భంగం కలిగించి, ఆమె భక్తిని పరీక్షించడానికి శివుడు గంగా నదిని పంపాడు. వారు సోదరీమణులు కాబట్టి తనకు హాని చేయవద్దని పార్వతీ దేవి గంగాదేవిని ప్రార్థించింది. అప్పుడు గంగ తన తపస్సుకు భంగం కలిగించలేదు. పార్వతీ దేవి మామిడి చెట్టు దగ్గర ఉన్న ఇసుకతో భగవంతుని స్మరించుకుంటూ శివలింగాన్ని తయారు చేసి ప్రతిష్టించింది. నేటికీ, ఇసుకతో చేసిన శివలింగం చెడిపోకుండా ఉండటానికి, అభిషేకం జాస్మిన్ ఆయిల్‌తో చేయబడుతుంది (ఇది తక్కువ సాంద్రత కలిగిన ద్రవం కాబట్టి).



## జల లింగం జంబుకేశ్వరం, తమిళనాడు

ఇక హరుడు జల తత్వాన వెలసిన క్షేత్రం జంబుకేశ్వరం. ఇక్కడి లింగం కిందిభాగం నుంచి సర్వకాల సర్వావస్థల్లోనూ నీరు ఊరుతుంటుంది. ఇక్కడి గర్భగుడి ముఖద్వారం ఎత్తు నాలుగే అడుగులు. ఈ స్వామి పేరు జంబుకేశ్వరుడు. అమ్మవారి పేరు అఖిలాండేశ్వరి. ఇక్కడ శివుడు అమ్మవారికి జ్ఞానోపదేశం చేశాడంటారు. శివుడు, పార్వతి దేవి ఇక్కడ గురు మరియు శిష్య సంబంధాన్ని కలిగి ఉన్నందున, శివాలయాలలో నిర్వహించబడే గిరిజా కల్యాణం (శివుడు మరియు పార్వతి దేవిల వివాహం) యొక్క శివరాత్రి ఉత్సవాలు ఈ ఆలయంలో నిర్వహించబడవు. ఆలయంలోని విగ్రహాలు ఒకదానికొకటి ఎదురుగా అమర్చబడి ఉంటాయి.ఈ లింగం క్రింద ఎప్పుడూ నీటి ఊట ఉండటం వలన దీనిని జలలింగం అంటారు. ఇది తమిళనాడులోని తిరుచురాపల్లికి సమీపంలో జంబుకేశ్వర క్షేత్రంలో ఉంటుంది. బ్రహ్మహత్యా పాతక నివారణకోసం పరమేశ్వరుడు జంబూక వృక్షం క్రింద తపస్సు చేసినందుకే ఇక్కడి శివునికి జంబుకేశ్వరుడని పేరువచ్చెను. పూర్వం ఇక్కడి శివలింగం ఏనుగులచే పూజలందుకోవడం, ఈ ప్రదేశంలో జంబు వృక్షాలు అధికంగా ఉండడం వలన ఈ క్షేత్రానికి జంబుకేశ్వరంగా పేరు వచ్చినట్లు చెబుతారు. తిరుచ్చికి 11 కిలోమీటర్లలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయం ఐదు ఎకరాల విస్తీర్ణంలో.. ఏడు ఎత్తైన గోపురాలతో నిర్మించబడి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. జంబుకేశ్వరంలోని శివలింగాన్ని జలానికి చిహ్నంగా పూజిస్తారు. ఇక్కడ శివలింగం పానపట్టం నుంచి నిరంతరం నీరు ఊరుతూ ఉండడం విశేషం. భక్తులు ఈ వింతను ప్రత్యక్ష్యంగా చూడవచ్చు. చెన్నై నుంచి జంబుకేశ్వరంకు 331 కిలోమీటర్ల దూరం.ఈ ఆలయంలో మాతృమూర్తి (పార్వతి దేవి) శివుడిని ఆరాధించిందని నమ్ముతారు, కాబట్టి ఆలయ పూజారులు అఖిలాండేశ్వరి దేవి ఆరాధనకు ప్రతీకగా ఒక స్త్రీ వలె దుస్తులు ధరించి భగవంతుడికి ప్రార్థనలు చేస్తారు . ఈ రోజువారీ ఆచారానికి ప్రతిరోజూ అనేక మంది యాత్రికులు హాజరవుతారు.ప్రాచీన భారతీయ సంప్రదాయంలో పరమశివుడిని అత్యున్నత గురువుగా పూజిస్తారు. నీరు జ్ఞానాన్ని సూచిస్తుంది మరియు నీటి ప్రవాహం అభ్యాసాన్ని సూచిస్తుంది. జంబుకేశ్వరర్ ఆలయం కాబట్టి జ్ఞానం, అభ్యాసం యొక్క ప్రాముఖ్యతను చాలా అందమైన మార్గంలో సూచిస్తుంది.ఈ ఆలయంలో పూజలు చేసేవారికి జ్ఞానం, తెలివితేటలు లభిస్తాయని చెబుతారు. జంబుకేశ్వర్ ఆలయం గురించి 5 వాస్తవాలు ఈ ఆలయం సుమారు 1800 సంవత్సరాల పురాతనమైనది మరియు కోచెంగన్న చోళుడు నిర్మించాడు.ఇది 18 ఎకరాలలో విస్తరించి ఉన్న భారతదేశంలోని పదమూడవ అతిపెద్ద దేవాలయం. ఆలయ గోడలపై చోళుల కాలం నాటి శాసనాలు ఉన్నాయి.ప్రతిరోజు మధ్యాహ్నం నిర్వహించబడే ఉచి కాల పూజ చాలా ప్రసిద్ధి చెందింది; ఈ పూజలో, పూజారులు పార్వతి దేవిని సూచించే చీరను ధరించి, అప్పు లింగానికి అభిషేకం చేస్తారు.అప్పు లింగం క్రింద ఉన్న నీటి ప్రవాహం ఎప్పుడూ ఎండిపోదని చెబుతారు.



## వాయు లింగం (శ్రీకాళహస్తి, ఆంధ్రప్రదేశ్)

ఇక పంచభూత లింగాలలో నాలుగోది వాయులింగం. మిగిలిన నాలుగు తమిళనాడులో వుంటే ఇదొక్కటే ఆంధ్రప్రదేశ్ రాష్టంలో ఉంది. అదే శ్రీకాళహస్తి. దక్షిణకైలాసంగా పేరొందిన ఈ క్షేత్రంలో శివలింగం గుండ్రంగా, నున్నగా ఉండదు. నలుపలకలుగా తెల్లగా ఉంటుంది.ఇక్కడ స్వామిపేరు కాళహస్తీశ్వరుడు. అమ్మవారి పేరు జ్ఞానప్రసూనాంబ. సాలెపురుగు, పాము, ఏనుగులకు మోక్షము ప్రసాదించిన క్షేత్రం. స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కాళహస్తీశ్వర ఆలయం గాలి మూలకాన్ని వర్ణిస్తుంది. ఈ ఆలయంలో శివుడు గాలిని సూచించే వాయు లింగం రూపంలో పూజిస్తారు. సమస్త జీవరాశులకు ప్రాణాధారమైన వాయుభూతానికి చిహ్నంగా ఈ శివలింగాన్ని పూజిస్తారు. ప్రపంచంలోనే ఉఛ్వాస నిశ్వాసలు తీసుకునే ప్రాణశివలింగ క్షేత్రంగా ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే ఆలయ గర్భగుడిలో అన్ని దీపాలు నిశ్చలంగా ఉన్నా... స్వామి వారికి ఎదురుగా ఉన్న దీపం మాత్రం ఆయన నుంచి వచ్చే గాలికి రెపరెపలాడుతుంది. దీనినే వాయు తత్వానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి సులభంగా చేరుకోవచ్చు. తిరుపతి నుంచి 38 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది.రాహు, కేతు, సర్ప, దోష నివారణ పూజలకు ఈ క్షేత్రం ప్రసిద్ధి. మరో విశేషం ఏంటంటే శ్రీకాళహస్తీశ్వరుణ్ని ఇంతవరకూ మానవమాత్రులెవరూ ముట్టలేదట. అభిషేకాలన్ని ఉత్సవమూర్తికే జరుగుతాయి. శ్రీకాళహస్తికి శ్రీ - సాలీడు, కాలా - పాము మరియు హస్తి - ఏనుగు నుండి దాని పేరు వచ్చింది. ఈ జీవులు తమ నిస్వార్థ భక్తితో శివుడిని ప్రసన్నం చేసుకున్నాయి. లోపలి గర్భగుడి లోపల గాలి ఉన్నప్పటికీ నిరంతరం మెరుస్తూ ఉంటుంది. కిటికీలు లేని ప్రధాన దేవత గదికి ప్రవేశ ద్వారం మూసివేసినప్పుడు కూడా వాయు లింగం కదలడాన్ని గమనించవచ్చు. వాయుదేవుడు-విశ్వంలోని అన్ని జీవరాశులలో సర్వశక్తిమంతుడిలాగే ఉండమని ప్రార్థించినప్పుడు శివుడు వాయు లింగంగా వ్యక్తమయ్యాడని చెప్పబడింది. అప్పుడు శివుడు తెల్లటి లింగంగా కనిపించాడు, దీనిని కర్పూర లింగంగా కూడా పిలుస్తారు. నేటికీ, లింగం తెల్లని రంగులో ఉంది,

కాళహస్తీశ్వర దేవాలయం గురించిన 5 వాస్తవాలు

ఆలయ ప్రారంభ నిర్మాణం 5వ శతాబ్దంలో నిర్మించబడింది. ఆ తర్వాత శతాబ్దాల పాటు శ్రీకాళహస్తి క్రియాశీలక నిర్మాణం కొనసాగింది.ప్రధాన గోపురం 120 అడుగుల ఎత్తుతో క్రీ.శ. 1516లో విజయనగర రాజు కృష్ణదేవరాయలచే నిర్మించబడింది. ఇది నిర్మాణ అద్భుతంగా పరిగణించబడుతుంది.గోపురం మే 2010లో కూలిపోయింది మరియు ప్రస్తుతం పునర్నిర్మాణంలో ఉంది.ఈ ఆలయం రాహు-కేతు పూజలకు ప్రసిద్ధి చెందింది. ఈ ప్రత్యేక పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించినప్పుడు రాహు, కేతువుల స్థానాలు మరియు కదలికల వల్ల కలిగే దుష్ఫలితాలు దూరమవుతాయని నమ్ముతారు. కాళహస్తీశ్వర ఆలయంలోని వాయు లింగాన్ని పూజారులు తమ చేతులతో తాకరని చెబుతారు.



## క్రేజీ కొరియోగ్రాఫర్‌తో

# అనసూయ రొమాన్స్




యాంకర్, నటిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన అనసూయ భరద్వాజ్ ఇప్పుడు కోలీవుడ్‌లో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ నటుడు, డ్యాన్సర్ ప్రభుదేవా హీరోగా నటిస్తున్న 'ఊల్ఫ్' అనే తమిళ చిత్రంలో ఆమె ఓ ప్రత్యేక గీతంలో మెరిశారు. ఈ పాటకు సంబంధించిన వీడియో తాజాగా విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.


వినూ వెంకటేశ్ దర్శకత్వం వహిస్తున్న 'ఊల్ఫ్' చిత్రం నుంచి చాలాకాలంగా ఎలాంటి అప్‌డేట్ లేదు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందనే ప్రచారం జరిగింది. అయితే, అందరినీ ఆశ్చర్య-పరుస్తూ చిత్రబృందం 'సాసా సాసా' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేసింది. ఈ పాటలో అనసూయ తన గ్లామర్ లుక్‌తో ఆక-ట్టుకుంటూ ప్రభుదేవాతో కలిసి రొమాంటిక్‌గా స్టెప్పులేశారు. ఆమె అభినయం, డ్యాన్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఇటీవల 'పుష్ప 2', 'రజాకార్' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రల్లో కనిపించిన అనసూయ, ఇప్పుడు పూర్తి భిన్నమైన స్టైలిష్ అవతారంలో కనిపించడం అభిమానులకు కొత్త అనుభూతినిస్తోంది. 'రంగస్థలం' చిత్రంలో రంగమ్మత్త పాత్రతో నటిగా అనసూయకు ప్రత్యేక గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వరుస అవకాశాలతో దూసుకుపోయిన ఆమె, ఇప్పుడు తమిళ చిత్ర పరిశ్రమపై దృష్టి సారించారు.

ఈ పాట విడుదలతో 'ఊల్ఫ్' సినిమాపై మళ్లీ అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో లక్ష్మీ-రాయ్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అనసూయ తమిళ ఎంట్రీ కోసం ఆమె అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అఖండ తాండవం సాంగ్ ప్రోమో వచ్చేసింది




తెలుగు సినిమా బాక్సాఫీస్‌పై 'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ, మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌కు తిరుగులేని రికార్డ్ ఉంది. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' వంటి మూడు బ్లాక్‌బస్టర్‌ల తర్వాత, ఈ డైనమిక్ ద్వయం నుండి వస్తున్న ప్రెస్టీజియస్ సీక్వెల్ 'అఖండ 2: తాండవం' ఇప్పుడు దేశవ్యాప్తంగా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 2021లో 'అఖండ' సృష్టించిన సునామీని మించి, ఈ 'తాండవం' మరింత రౌద్రంగా, శక్తిమంతంగా ఉండబోతోందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

'అఖండ' సక్సెస్ వెనుక బాలయ్య రౌద్రం, బోయపాటి టేకింగ్‌తో పాటు ఎస్. ఎస్. తమన్ అందించిన శివతాండవ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణ. ఇప్పుడు ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతోంది. డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమా కోసం అభిమానుల ఎదురు చూపులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే, చిత్ర బృందం శుక్రవారం 'ది తాండవం ప్రోమో'ను విడుదల చేసి అంచనాలను మరింత పెంచింది. తమన్ తన బీజీఎంతో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు మరోసారి ప్రాణం పోస్తున్నట్టు ఈ ప్రోమో స్పష్టం చేసింది.

'అఖండ 2: తాండవం' కేవలం తెలుగుకే పరిమితం కావడం లేదు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. పాన్ ఇండియా స్థాయిలో రికార్డులు సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నందమూరి కుటుంబం నుంచి ఎం. తేజస్విని నందమూరి ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించడం ఈ సినిమాకు మరింత హైప్‌ను తీసుకొచ్చింది.

ఇప్పటికే విడుదలైన టీజర్లలో, బాలకృష్ణ మంచు కొండల్లో నాగసాధువు గెటప్‌లో త్రిశూలం పట్టుకుని కనిపించిన విజువల్స్.. 'అఖండ' క్యారెక్టర్‌ను మరో స్థాయిలో నిలబెట్టాయి. అధర్మంపై ధర్మాన్ని నిలబెట్టే బాలయ్య పోరాటం, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. డిసెంబర్ 5న బాలయ్య అభిమానులకు పండగ వాతావరణం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.






# 'పెద్ది' నుంచి 'చికిరి చికిరి' వచ్చేసింది

తెలుగులో మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో పెద్ది ఒకటి. గేమ్ ఛేంజర్ సినిమా తర్వాత రామ్ చరణ్ నటిస్తోన్న ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది. ఇందులో కన్నడ హీరో శివరాజ్ కుమార్ కీలకపాత్రలో నటిస్తున్నారు. రూరల్ బ్యాగ్ డ్రాప్ లో వస్తున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఆస్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, టీజర్ ఆకట్టుకుంటున్నాయి. పాన్ ఇండియా లెవల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన అన్ని అప్డేట్స్ ఆకట్టుకుంటుండగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈసినిమా నుంచి ఫస్ట్ లిరికల్ చికిరి.. చికిరి పాటను విడుదల చేశారు మేకర్స్. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించిన ఈ సాంగ్ ఇప్పుడు అందరిని ఆకట్టుకుంటుంది.

రెహమాన్ మాస్ మ్యూజిక్, రామ్ చరణ్ మాస్ స్టెప్పులు అదిరిపోయాయి. ఇక జాన్వీ లుక్స్ నెక్ట్స్ లెవల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సాంగ్ అందరిని మెస్మరైజ్ చేస్తుంది. చికిరి చికిరి అంటూ సాగే పాటకు ఊర మాస్ లుక్ లో వెస్ట్రన్ స్టెప్పులతో అదరగొట్టారు చరణ్. చిరుత తర్వాత ఆ రేంజ్ ఎనర్జీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. పెద్ది సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాగ్రౌండ్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాలో చరణ్ పక్కా ఊర మాస్ అవతారంలో కనిపించనున్నారు. దేవర తర్వాత జాన్వీ నటిస్తోన్న రెండో సినిమా ఇది. ఇందులోనూ మరోసారి పల్లెటూరి అమ్మాయి అచ్చియమ్మ పాత్రలో కనిపించనుంది జాన్వీ.

# ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. మగ బిడ్డకు జన్మనిచ్చిన కత్రినా



బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ పేరెంట్స్‌గా ప్రమోషన్ పొందారు. ఈ రోజు (నవంబర్ 7) కత్రినా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఈ ఆనందాన్ని షేర్ చేసుకుంటూ విక్కీ కౌశల్ పోస్ట్ పెట్టారు. "ఎంతో సంతోషంగా ఉంది. మా ప్రేమకు చిహ్నంగా బాబు జన్మించాడు. మీ అందరి ఆశీస్సులు చిన్నారికి అందించండి" అంటూ విక్కీ ఈ శుభవార్తను షేర్ చేశారు.

పోస్ట్‌కు వస్తున్న రియాక్షన్

విక్కీ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారడంతో అందరు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఫ్యాన్స్‌తో పాటు, సినీ తారలు రెడ్ హార్ట్ ఎమోజీలు కామెంట్ చేశారు. ఈ పోస్టుకు పెట్టిన కొన్ని నిమిషాలకే లక్షల్లో లైక్ కొట్టారు నెటిజన్లు. అలానే వీరిద్దరి కుటుంబసభ్యులు కూడా కామెంట్స్ రూపంలో వీరిద్దరిని ఆశీర్వదిస్తున్నారు. ఎప్పటినుంచో కత్రీనా తల్లి కాబోతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ, ఈ జంట రియాక్ట్ అవ్వలేదు. కానీ గల నెలలో దీనిపై క్లారిటీ ఇచ్చారు. దీనిని అధికారికంగా ధ్రువీకరించారు. ఇప్పుడు బేబీ బర్త్ గురించి గుడ్ న్యూస్ అందరితో షేర్ చేసుకున్నారు. బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం ప్రకారం, కత్రినా కైఫ్ మెటర్నిటీ బ్రేక్ తీసుకొని, కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం. ఈ బ్రేక్‌లో ఆమె ఫ్యామిలీతో టైమ్ స్పెండ్ చేయాలనుకుంటున్నారు.

కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ పెళ్లి బాలీవుడ్‌లో అత్యంత చర్చనీయాంశంగా నిలిచింది. 2021 డిసెంబర్ 9న రాజస్థాన్‌లోని సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బార్వారా ప్యాలెస్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. పెళ్లి వేడుక పూర్తయ్యాక, కత్రినా-విక్కీలు షేర్ చేసిన అఫీషియల్ వెడ్డింగ్ ఫొటోలు సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్‌గా మారాయి. ప్రత్యేకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ ఫొటోలు అప్పటివరకు అత్యధిక లైక్‌లు వచ్చిన పోస్టులలో ఒకటిగా నిలిచాయి.

విక్కీ కౌశల్ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్. వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ, ప్రతిసారి కొత్తగా కనిపించేందుకు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల వచ్చిన బ్యాడ్ న్యూజ్ లో కామెడీ రోల్‌తో ప్రేక్షకులను అలరించారు. అదే సమయంలో యాక్షన్ జానర్‌లో వచ్చిన 'ఛావా' మూవీతో బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుని రికార్డులు సృష్టించారు. ఈ చిత్రం రూ.800+ గ్రాస్ వసూల్ చేసింది. 2025లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఛావా టాప్‌లో కొనసాగుతోంది. ఇక రొమాన్స్ నుంచి హిస్టారికల్, యాక్షన్ నుంచి కామెడీ వరకు విభిన్న పాత్రల్లో నటిస్తూ, తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సూపర్ స్టార్ స్థాయికి ఎదుగుతున్నారు విక్కీ కౌశల్.

# బాయ్ ఫ్రెండ్ బిగి కౌగిలిలో సమంత




సమంత ఇటీవల కాలంలో సినిమాల కంటే కూడా తన వ్యక్తిగత విషయాల ద్వారా వార్తల్లో నిలుస్తున్నారు. సమంత, నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత మరొక దర్శకుడు రాజ్ నిడుమోరితో కాస్త చనువుగా ఉంటున్న సంగతి తెలిసిందే .ఎక్కడికి వెళ్ళినా వీరిద్దరూ జంటగా కలిసి వెళ్లడంతో వీరి రిలేషన్ గురించి ఎన్నో రకాల వార్తలు బయటకు వచ్చాయి. వీరిద్దరూ రిలేషన్లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అంటూ వీరిపై ఎన్నో రకాల వార్తలొచ్చిన వీరిద్దరూ ఎక్కడ స్పందించలేదు.

ఇక సోషల్ మీడియా వేదికగా సమంత షేర్ చేసే ఫోటోలు మాత్రం సంచలనగా మారుతున్నాయి. తాజాగా సమంత తన స్నేహితులతో కలిసి ఒక వేడుకలో పాల్గొన్నారు. సమంత తన పెర్ఫ్యూమ్ బ్రాండ్ సీక్రెట్ ఆల్కెమిస్ట్ లాంచ్ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. అయితే ఈ ఫోటోలలో భాగంగా సమంత రాజ్ కు సంబంధించిన ఫోటోలు మాత్రం సంచలనంగా మారాయి. సమంత రాజ్ ను హగ్ చేసుకుని చాలా చనువుగా కనిపించడంతో ఈ ఫోటో వైరల్ అవుతుంది. ఇక ఈ ఫోటోపై అభిమానులు విభిన్న రీతిలో స్పందిస్తున్నారు. సమంత ఈ ఒక్క ఫోటోతో వీరిద్దరి రిలేషన్ కన్ఫర్మ్ చేసినట్టేనా అంటూ కొంతమంది కామెంట్లు చేయగా మరి కొంతమంది కాస్త గ్యాప్ ఇవ్వొచ్చు కదా సమంత.. మరి అంత చనువు ఏంటి అంటూ కామెంట్లు చేస్తున్నారు.

ఇక ఈ ఫోటో పై మరి కొంతమందికి వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. తరచు ఇలా వార్తలలో నిలవడం కంటే రిలేషన్ కన్ఫామ్ చేయొచ్చు కదా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరి ఇప్పటికైనా సమంత డైరెక్టర్ రాజ్ తో తన రిలేషన్ కన్ఫామ్ చేస్తుందా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఇక సమంత రాజు డైరెక్షన్ లో ది ఫ్యామిలీ మెన్ 2 సిరీస్ లో నటించిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి వీరిద్దరి మధ్య మంచి పరిచయం ఏర్పడటం ఆ పరిచయం కాస్త ప్రేమగా మారిందని తెలుస్తోంది. ఇక ఈయన కారణంగానే సమంత నాగచైతన్య విడాకులు తీసుకున్నారనే వార్తలు కూడా ఒకానొక సమయంలో తెరపైకి వచ్చాయి. ఇక సమంత కెరియర్ విషయానికి వస్తే ఇటీవల ఈమె సినిమాలను తగ్గించినా పలు బిజినెస్ లను నిర్వహిస్తూ బిజినెస్ ఉమెన్ గా దూసుకుపోతున్నారు. ఇప్పటికే సమంత సాకీ అనే బ్రాండ్ తో దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఈమె ఆల్కెమిస్ట్ అనే పెర్ఫ్యూమ్ బ్యాండ్ కూడా ప్రారంభించారు. వీటితోపాటు ట్రాలాల అనే నిర్మాణ సంస్థను కూడా ప్రారంభించి నిర్మాతగా కూడా మంచి సక్సెస్ అందుకున్నారు. ప్రస్తుతం సమంత నందిని రెడ్డి డైరెక్షన్ లో మా ఇంటి బంగారం అనే సినిమా పనులలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఈ సినిమా పూజ కార్యక్రమాలను జరుపుకుంది. అయితే ఈ సినిమా సమంత ఈ సినిమాను తన సొంత నిర్మాణ సంస్థలోని చేస్తున్న సంగతి తెలిసిందే.

# భయపెడుతున్న 'కుంభ' ఫస్ట్ లుక్!




సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా SSMB 29. ఇది వర్కింగ్ టైటిల్ మాత్రమే. డైరెక్టర్ రాజమౌళి మరోసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న ఈ సినిమా పై పాన్ ఇండియా లెవల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి విషయంపై ఓ రేంజ్ హైప్ నెలకొంది. యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా, మలయాళీ స్టార్ పృథ్వీరాజ్ సుకుమార్ తోపాటు హాలీవుడ్ స్టార్స్ సైతం కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ ను #GlobeTrotter అనే హ్యాష్ ట్యాగ్ తో షేర్ చేస్తున్నారు జక్కన్న. తాజాగా ఈ మూవీ నుంచి పృథ్వీరాజ్ ఫస్ట్ లుక్ పోస్టర్ రివీల్ చేశారు.

ప్రస్తుతం విడుదలైన పోస్టర్ చూస్తుంటే జక్కన్న సినిమాలో పృథ్వీరాజ్ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఒక వీల్ చైర్ లో కూర్చుని రోబో సాయంతో ఒక భారీ ఫైట్ సీన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ను ప్రేరణగా తీసుకుని ఈపాత్రను డిజైన్ చేసినట్లుగా తెలుస్తోంది. పృథ్వీరాజ్ పాత్ర గురించి జక్కన్న.. "పృథ్వీతో మొదటి షాట్ చిత్రీకరించిన తర్వాత నేను అతడి దగ్గరకు వెళ్లి, మీరు నాకు తెలిసిన అత్యుత్తమ నటులలో ఒకరు అని చెప్పాను. ఈ దుష్ట, క్రూరమైన, శక్తివంతమైన విరోధి కుంభకు ప్రాణం పోయడం సృజనాత్మకంగా చాలా సంతృప్తికరంగా ఉంది. పృథ్వీకి ధన్యవాదాలు" అంటూ రాసుకొచ్చారు.

ఈ సినిమా టైటిల్ తోపాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ ఈనెల 15న రిలీజ్ చేయనున్నారు. అందుకే నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ వేడుక నిర్వహించనున్నట్లు జక్కన్న తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వేడుక కోసం ప్రియాంక చోప్రా ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com